ఉన్నవాడు తప్పుచేస్తే
గౌరవించే చట్టానికి
లేనివాడు తప్పుచేస్తే
శిక్షించే హక్కు వుందా?




# చట్టమా? నువ్వేం చెయ్యగలవు

ఏంరా నారిగా ఆ ఎరువు దిబ్బ మొత్తంగా ఎంత కిత్తావేంటి?'' ప్రశ్నించేడు బుర్రమీసాల గంగాధరం.

''మొన్న సందెకాడ రాములు దొరగారు వందా యాభైకి అడిగిండారు దొరా...'' నీళ్ళు నములుతూ సమాధాన మిచ్చాడు నారిగాడు.

బీడి చివరి దమ్ము గట్టిగా లాగి అదే చేత్తో బుర్ర మీసాలు మరింత గట్టిగా మెలివేస్తూ దిబ్బకేసి పరికించి చూశాడు గంగాధరం.

''వందా పాతిక రూపాయల కిమ్మత్తు యిద్దామని వుందిరా అసలు దిబ్బ మతింపు వంద రూపాయలు మించదనుకో. ఏదో చేతికింది వాడివి గదా — ఓ పాతిక అదనంగా యిస్తున్నాను''

''తమ దయ బాబూ ఏలిన వారి చెంత బొంక కూడదని సత్తెప్రి చెప్తిని గదా''

''నీ బొంద అయినా అంతకు మించి నా వల్ల కాదు. నీకు యిష్టమైతే సంచకారమిస్తాను. కష్టమైతే మరోచోట బేర మాడతాను.''

''అలాగే కానండి దొర. తమకాడ మరో బేరమేంటి. పాతిక రూపాయలు సంచి కారమిప్పించండి''

నారిగాడి సమాధానం వింటూనే జేబులోంచి రెండు పది రూపాయల నోట్లు తీసి వాడికిచ్చాడు.

''పాతిక లేదు కానీ యివాల్టి కిది వుంచు. రేపు పెందలాడే ఎరువు సొంతం తోలేశాక సందెకాడ వచ్చి మిగతా వందా అయిదు పట్టుకెళ్ళు''

రామాపురమనే ఆ గ్రామంలో గంగాధరం మోతుబరి రైతు. అతని రెండు వందల ఎకరాల మాగాణి భూమి కీ ప్రతి ఏడూ కొన్ని వందల పనికల కొలత ఎరువు కొంటూ వుంటాడు.

రామాపురం ప్రక్కనే ఒక చిన్న మాల గూడెం వుంది. అందులో నివసించే మాలలంతా దినసరి వ్యవసాయ కూలి పనిపై ఆధారపడి బ్రతికే నిరుపేద కార్మికులే. తీరిక వేళల్లో ఎరువులు ప్రోగు చెయ్యటం దరిదాపు ల్లోని కొండల్లో దొరికే ఆకూ అలముతో ఆ దిబ్బలను పెంచి గ్రామంలోని మోతుబరి రైతులకు వాటిని అమ్మి సొమ్ము



చేసుకొనడం వారి అదనపు జీవనోపాధి.

ఎప్పటిలాగే ఆ ఏడు కూడా గూడెంలో తన కందుబాపైన దిబ్బ లన్నింటినీ కొనేశాడు గంగాధరం. వాటిలో నారిగాడి దిబ్బ కూడా ఒకటి.

ఆ రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో పెరుగూ, అన్నమూ కడుపు నిండా తృప్తిగా భోంచేసి — గుంటూరు పొగాకుతో నంజుడు వేసిన కొండపల్లి కారపాకుల తాంబూళం — పుక్కిటి నిండా నములుతూ సోఫాలోంచి బయటకు వచ్చి పాలేరు పాపన్న కోసం గట్టిగా కేక వేశాడు గంగాధరం.

''ఇదిగో వస్తిని దొర్కా.'' — గబ గబా వచ్చి వినయంగా చేతులు కట్టుకుని నిల్చున్నాడు పాపన్న.

''ఈయాల సందెకాడ మాలగూడెం నారి గాడి దిబ్బ వందా పాతికెట్టి కొన్నానురా. గిట్టు బాటవుద్దా?''

''ఏమో దొరా దిబ్బ చాలా చిన్నది. అయిదు కొలత పనకలు మించి కాదని పిస్తుంది. కాస్త ఘాపైన బేరమే చేశారు లాగుంది''

''ఏడిశావు లేరా. మతింపు అంచనాలకు మన బుర్ర పెట్టింది పేరు గదరా. చూస్తాండు. తప్పక పది కొలత పనకలు దిగి తీరుద్ది... పెందలాడే లేచి వెళ్ళి ఆ దిబ్బ సాంతం తోలేసెయ్యి''

''అలాగే దొరా — '' నెత్తి మీది రుమాలు సర్దుకుంటూ అక్కడ నుంచి వెళ్ళిపొయ్యాడు పాపన్న.

మరునాటి వుదయం జున్ను రొట్టె కడుపు నిండా తిన్న తరువాత తృప్తిగా త్రేన్చుకుంటూ గుమ్మం వెలుపలకు వచ్చేడు గంగాధరం.

సరిజోడైన గద్వాల కోడెలచే పూన్చబడి నిండు మాలాలు కంటే బరువుగా ముందుకు సాగివస్తున్న ఎజువు బండి సరిగ్గా అప్పుడే అతని కంట పడింది అల్లంత దూరం నుంచి తన యజమానిని చూడగనే పగ్గాలు ఒడిసి పట్టుకుని బండిని ఆపివేశాడు నగల్లోని పాపన్న.

''దొరా ఎరువంతా తోలేస్తిని. ఇదే ఆఖరు బండి.''

''ఆ... ఆ... ఎన్ని కొలత పనక లైందిరా?'' కంగారుగా ప్రశ్నించేడు.

''నే జెప్పలా... అయిదంటే అయిదు బండ్లే అయ్యింది దొరా'' తన అంచనా తప్పలేదన్న ధీమా పాపన్న సమాధానంలో వ్యక్తమయింది.

''ఏడిచావులేరా. ఆ ముష్టి ముండా కొడుకు దిబ్బ క్రింద గుంత వుందని కూసిండు..''

''గొయ్యి కాదు దొరా. దిబ్బ క్రింద నేలంతా మిర్రు మిర్రుగా వుండాది.''

''దగా పడి పొయ్యుండాము రోయ్! ఈ నడుమ మాల గాడిదలు బొంకు బాగా నేర్చిండారు. నేనేం తక్కువ తిన్నా్నా. సంచి కారం యిరవై రూపాయలే యిచ్చింటిని. వందా అయిదు రూపాయలు నా దగ్గర వుండనే వుండాయి. నారిగాడు దుడ్ల కోస మొస్తే యిక నలభై రూపాయలు ఆడి మొగాన కొడితే సరిపోద్ది.''

''ఆ — అంతే దొరా పనక పన్నెండు చొప్పున మొత్తం అరవై అవుద్ది'' సమాధాన మిచ్చి పగ్గాలు వదులు చేసి చొలకాల ఝుళిపించేడు పాపన్న. బండి కల్లము వేపు కదిలి పోయింది.

ఆనాటి అసుర సంధ్యవేళ చల్లగా పిల్లగాలులు మెల్ల మెల్లగా సాగిపోతున్నాయి. వాటి తాకిడికి గట్ల మీది గరిక కాడలు సైతం తృప్తిగా తలలాడిస్తున్నాయి.

మఖ కార్తె పోతున్నందుకూ, పుబ్బ కార్తె వస్తున్నందుకూ నిదర్శనంగా ఆకాశం మెల్ల మెల్లగా మేఘావృత మౌతున్నది.

పిట్టమడిలో నాట్లు వేస్తూన్న పల్లె పడచుల పకపకలు — గూళ్ళకు తిరిగి వస్తున్న పాల పిట్టల కిలకిలలు — వుండి వుండి కూస్తున్న కోయిలమ్మ గీతాలాపనలా — అన్నీ కలసి శ్రోతల మనస్సుకు అనూహ్యమైన వింత అనుభూతిని ప్రసాదిస్తున్నాయి.

ఊట బావిలోని స్వచ్ఛమైన జలధార పంట కాలువ నిండా ప్రవహిస్తుంటే తృప్తిగా వాటికేసి చూస్తూ మడవ మార్చటానికి సిద్దంగా నిల్చున్నాడు. పాపన్న.

''అందాజా — ఒరేయ్ అందాజుగా'' — బిగ్గరగా కేకలేస్తున్నాడు గంగాధరం.

''ఎవరబ్బా ఈ అందాజుగాడు'' అనుకుంటూ తల పైకెత్తేడు పాపన్న. గంగాధరం తన వైపే వ స్తుండటం చూసి ఆశ్చర్యపోయాడు.

''ఒరే పాపిగా — నిన్నేనోయ్ పలకవేం?''

''అందాజు గాడేంటి దొరా?''

''నువ్వేనోయ్ అందాజు గాడివి. రాసిని అందాజుగా మతింపు వేయటంలో నీకు నువ్వే సాటిరోయ్. అందుకే ఆ యాల నుంచీ నువ్వు అందాజు గాడివే'' బుర్ర మీసాలు మెలివేస్తూ పగల బడి నవ్వేడు గంగాధరం.

''భలే భలె దొర — మా మంచి బిరుదిచ్చిండారు. ఈ పాపిగాడి జనమ తరించినట్టే'' ఉబ్బి తబ్బిబ్బవుతూ చేతుల్లోని పారను అక్కడే జారవిడచి ఒక్క అంగలో తన యజమాని దగ్గరకు వెళ్ళాడు పాపన్న.

''ఆ — మరచిపొయ్యాను. నారుమడికి ఈయాల నీళ్ళెట్టావా? — నీళ్ళు పెట్టినవా? లేదా.

''ఇందాకే పెట్టొస్తిని దొర. పిట్టమడిలో నాట్లు కూడ అయిపోతయి''

''రేపు డొంక క్రింద మిట్ట కూడా నాట్లకు సిద్ధం చేయించెయ్'' మరునాటి కార్యక్రమాన్ని విశదం చేస్తూ బీడీ వెలిగించాడు గంగాధరం.

''దొరా!''— వెనుక నుంచీ మెల్లగా పిలిచాడు అప్పుడే అక్కడకు వచ్చిన నారిగాడు.

''ఒరోరి నువ్వట్రా నారిగా. సరిగ్గా నీకు నూరేళ్ళు ఆయుష్షనుకో. ఇప్పుడే గదర నిన్ను గూర్చి పాపిగాడితో చెప్తిని'' ముఖం మీద చిరునవ్వు పులుముకుంటూ వాడిని పరామర్శించాడు గంగాధరం.

''ఔను దొరా, ఇంటేది రేతిరికి బత్తెం గింజలు లేవంది. దిబ్బ లెక్క పట్టుకపోదామని యింటి కాడ చూస్తిని. అక్కడ లేక పోతిరి. తోట కాడికే వస్తిని'' నీళ్ళు నములుతూ మెల్లగా వచ్చిన విషయం బయట పెట్టాడు నారిగాడు.

''ఆ — అదేరా దిబ్బయిసయమే నీతో కాస్తంత మాట్టాడాల. నేనేమో పది కొలత పనకల కిమ్మత్తు కట్టి బేరమాడితిని. తోలేప్పటికి అది కాస్తా అయిదయి కూచుంది. పైగా దిబ్బలో పేడ పిడకల కంటే మట్టి వుండలే జాస్తీగా కలిసుండాయి.''

''పనకల యిసయమే నేను మాటాడలేదు గద దొరా. మొత్తంగా నా కిమ్మత్తు నే జెప్తిని. మీ కిమ్మత్తు మీరడిగిరి. మీ మతింపు ఎలకే సొమ్మును అమ్మితివి గదా''

''ఒయ్.. ఒయ్.. — నే బేరమాడితి ననుకో. నీ దిబ్బ కింది మిర్రు నీ బుర్ర కందెనా? యిసయం



తెలిసి నువు యిడమరసి చెప్పితివా! ఎందుకోయ్ దాపరికం??''

''నా దిబ్బ క్రింద నేలంతా చదునుగానే ఉండాది దొరా. మిర్రూ లేదు తొర్రా లేదు. అంతా మీ బెమ''

''నీతో నాకు మాటలేంటి రోయ్. అయిదు పనకలకూ పనక్కు పన్నెండు చొప్పున లెక్కన గట్టీ ఇంకా నలభై రూపాయలిస్తుండా. ఇట్టమైతే షట్టు కెళ్ళు. కట్టమైతే బేగఎళ్ళి రేతిరికి పస్తు తప్పదని యింటి దానితో చెప్పకో''

''ఏంధయ్యా నువు చెప్పేది. రెక్కల కట్టం మీద పోసేసిన దిబ్బంతా నీ కళ్ళానికి తోలి నే పస్తు పడుకోవాలా? — నీ పనక కొలత యిసయం గూడానికంతా తెలియని సత్తెమా ఏంటి? — ఊరందరి పనకలు కలేసినా నీ దానంత దొడ్డది కన్పిస్తే ఒట్టేట్టు. రెండు పనకల కొలత దిగేట్టు చేయించి మోసగించే నువ్వూ ఒక మోతుబరీ రైతువే నటయ్యా. అసలు నీకు కిమ్మత్తునకు తప్పితే కొలతకు ఎటువమ్మే వాడెవడంట??''

''ఏం కూసిండావురా. నా పనకలో మోసముండాదా? — మాలముండా కొడుకువు. మోసం నీకు చెల్లు. నీ యబ్బకు చెల్లు. పల్లెకంతా పెద్ద మోతుబరీ రైతును నేను. నన్ను పట్టుకుని మోసం గీసం అంటావా? యదవన్నర యెదవా''

''మోసమో — దోసమో — నా వంద మీద అయిదూ నా మొగాన కొడితే మరీ మాటాడితే నీ. చెప్పచ్చుక కొట్టు''

''మల్లా మొదటికే వచ్చితివన్న మాట. నీకు చేతైతే నలభై రూపాయలు పట్టుకపో. మరో మాటంటే అది కూడా యివ్వను గాక యివ్వను. ఎళ్ళి నీ బాబుతో చెప్పకో — ఫో''

''నీ యవ్వారం బలే బాగుండాదయ్యా! — నా సొమ్ము నాకీ కుంటే ఊరికే వదిలేత్తానేంటి? నిలబెట్టి వసూలు చెయ్యనూ''

''అద్గదీ — మా బాగా చెప్పావురోయ్. నా ఆయుర్దం కూడా పోసుకుని నూరేళ్ళూ నిండుగా బతుకు. రిత్తగా పోడానికి మనమేమీ సన్నాసులమూ గాదు. సత్తెగాళ్ళమూ గాదు'' నాట్లు పూర్తి చేసుకుని అప్పుడే అక్కడకు వచ్చిన రత్తి కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడేసింది.

''రత్తెమ్మో నువ్వా! — ఈన కాడికి పని కొచ్చిండావా? మాట్టాడక ఊరకుంటావనటే పెద్ద పనకలు ఛేయించి తక్కువ కొలతలు చూపించి ఘరానా పెద్ద మనిషి కాడ మనకు ములాబేంటే'' కిసుక్కున నవ్వేడు నారిగాడు.

వాడి మాటలతోనే వుడికి పోతూన్న గంగాధరం రత్తి అక్కడకు రావడంతో మరింత మండి పడ్డాడు. జేవురించిన ముఖంలో చింత నిప్పుల్లాంటి గుడ్లు మరింత మిటకరించుకొని నారిగాడి వంక వురిమి చూడసాగేడు. ఇంతలో పిట్టమడిలో నాట్లు పూర్తి చేసిన ఆడ కూతురులందరూ కూడా అక్కడకు వచ్చేశారు.

''ముందు మా కూల్లు మాకిచ్చి పంపించవయ్యా. ఆనేక నింపాదిగా మింగేద్దువుగాని'' — కసిరినట్లు మాట్లాడింది రత్తి.

''వరే పాపిగా ముందీ పంది కొక్కులకు కూలిచ్చి పంపించెయ్'' కోపంలో తన కసి నంతా వెళ్ళగక్కేడు.

''ఏమయ్యోయ్ — మాటలు జాగర్తగా రానివ్వు. నువ్విచ్చే కూలికి సరిపడే పని చెయ్యనే చేస్తిమి. ఊరకే మాటలంటే కుక్కిన పేనులా పడిపోడానికి నేనేం నీ బానిస పిల్లను కాదు''

''సర్లేవే — యింద తీసుకో నీ ముష్టి మూపావలా'' డబ్బులు జేబులోంచి బయటకు తీయబొయ్యాడు పాపన్న.

''మద్దేనం పనికి పిలిచినపుడు రూపాయన్నర యిత్తామంటిరి. ఇప్పుడు ముప్పావలాతో సరి పెడితేనే నొల్ల. అట్టే నోరు పాడుజేసుకోక ముందే నా దుడ్లు నాకు పడెయ్యండి'' తోక త్రొక్కిన త్రాచులా లేచింది.

''పాతికెకరా మిగిలిండాది. దరమంగా ముప్పావలా యిత్తామంటే మరియాదగా వత్తిరా? — రూపాయన్నర అనంగానే పగలబడి నవ్వుతూ వత్తిరి. నేనేం తక్కువ తిన్నానా. మీ కట్టం ముప్పావలాతో

సమ్మం. బేకైతే తీసుకొండి. లేకుంటే వుత్త చేతులు వుండనే వుండాయి గదా'' — ఉడుకు మీద కాస్త గట్టిగా అన్నాడు గంగాధరం.

''రత్తి నువ్వు ఒప్పుకోకే. ఇచ్చేదాకా చచ్చినా కదలొద్దు. మునుపొకమాట. పని జరిగి పోనాక మరోటీనా? — అన్నిటికీ తలలూపటానికి మనం గంగిరెద్దులమా ఏంటి?'' — నారిగాడు ఆమెకు వత్తాసు పలికేడు.

''సరి సరి — అనవసరంగా మీతో పొద్దు గడపటం కంటే నాకు మరోపని లేద్రా — మీ కరమ మీది ఎవరి ప్రాపతం వారిది.'' అంటూ విసురుగా ముందుకు పోబొయ్యాడు గంగాధరం.

అతని వాలకం గమనించిన రత్తి మరింత మండిపడుతూ ముందుకు దూసుక వెళ్ళి చొక్కా పట్టుకుని ఆపి వేసింది. రూపాయిన్నర చొప్పున అందరకూ కూలిచ్చేదాకా కదలటానికి వీల్లేదంటూ నిలదీసింది. మిగతా పడుచులందరూ కూడా ఆమెను అనుసరించారు. బిల బిల మంటూ వచ్చి అతన్ని చుట్టుముట్టారు. వారి డబ్బులు వారి కివ్వందే అడుగు ముందుకు వేయనివ్వమని మొరాయించారు.

గంగాధరం కసురుకున్నాడు. పుల్ల విరుపు మాటలతో వారిని, తికమక పెట్టాలని యత్నించాడు. ఆడకూలీల సంఘటిత శక్తి ముందు అతను చిత్తయి పోయ్యాడు. మాటకు మాట అందుకోవడమే కాక అందరూ కలిసి కట్టుగా అతన్ని ఎదురించారు. అవసరమైతే ప్రత్యక్ష చర్యకు కూడా సిద్దమయ్యారు.

ఇక చేసేది లేక తలా రూపాయన్నర చొప్పున అందరకూ కూల్లు పంచేశాడు గంగాధరం. డబ్బులు చేతుల్లో పడగానే గట్టిగా నారిగాడి వీపు చరిచింది రత్తి.

''ఒరోయ్ — మేము వెళ్ళి పోతుండాము. నీ లెక్కంతా నీ కిచ్చేదాకా యింటికి రాబోకు. ఈన కాడ తల ఒగ్గితే ఆనేక మనం బతకలేం. ఇలాంటి రకాలు చాలా వుండాయి'' — వాడిని గట్టిగా హెచ్చరించి అక్కడ నుంచి చరచరా వెళ్ళిపోయిందామె. మిగతా ఆడకూలీలందరూ కూడా ఆమెను అనుసరించారు.

గంగాధరం గుండెలు మండుతున్నాయి. శరీరంలోని అణువణువూ కంపిస్తున్నది. పండ్లు నూరుతున్నాడు. గుడ్లు ఉరుముతున్నాడు. ఇప్పుడక్కడ అతనూ నారిగాడూ పాపన్నా మాత్రమే వున్నారు.

నారిగాడు డంగై పోతున్నాడు. జారిపోతున్న ధైర్యాన్ని కూడదీసుకుంటున్నాడు. గుండె లోతుల్లోంచి మాటలు పెకలించాలని యత్నిస్తున్నాడు.

గంగాధరం రెండడుగులు ముందుకు వేశాడు. అమాంతంగా వాడి చొక్కా కాలరు గట్టిగా పట్టుకున్నాడు.

''ఇప్పుడు చెప్పరా — దాని లాగే నువ్వు కూడా మునుపు చెప్పిన మొత్తమంతా యిచ్చేదాకా కదలవా?'' — పెద్దపులిలాగా గర్జించాడు.

.............

''ఏరా మాట్టాడవేం? మాటలు



చిల్లర

మ్యూజియంలో చుట్ట తాగుతున్నాడు పార్వతీశం. ''సార్? యిక్కడ చుట్ట తాగితే అయిదు రూపాయలు ఫైన్ కట్టాలి సార్?'' అన్నాడు అక్కడి ఉద్యోగి.

వెంటనే పార్వతీశం ఓ పదినోటు తీసి ఉద్యోగికి యిచ్చాడు.

''నాదగ్గర చిల్లర లేదండీ'' అన్నాడు ఆ ఉద్యోగి.

''వద్దులే.. నేను యింకో చుట్ట తాగాలి. లెక్క సరిపోతుందిగా'' చెప్పాడు పార్వతీశం.

—ఆకెళ్ళ శివరామ శర్మ (తిరుపతి)

పడిపోయిండాయా? లేక ఏం చేత్తాడు లెమ్మని మిడిసి పడుతుంటావా?''

............

''మరియాదగా నే యిత్తున్న నలభై పట్టుకపో. లేదా నీ జబ్బ నా దెబ్బ రుచి చూస్తాది జాగర్త'' — హుంకరించాడు గంగాధరం.

నారిగాడి కండ్లల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. నోరు విప్పితే దుఃఖం ఆగేట్టు లేదు. ఇక చేసేది లేక మౌనంగా నలభై రూపాయిలూ అందుకోబొయ్యాడు. సరిగ్గా అప్పుడే దూరంనుంచీ ఎవరిదో గాజుల శబ్దం విన్పించింది. అమాంతంగా వాడి గుండెల్లో రత్తి రూపం గిర్రున తిరిగింది. ఇవస్త్రుడు ఢీలాపడిపోయి అన్యాయానికి తలవంచితే ఆనేక అతి ముఖాన పేడ వేస్తుంది. ఆ అవమానం భరించే కంటే వీడిని ఎదురించటమే నయం.

నారిగాడు అమాంతంగా విజృంభించాడు. గంగాధరం చేతిని విదిలించి కొట్టేడు. రెప్పపాటులో రెండడుగులు వెనక్కు వేశాడు.

''మీరేం జేసినా సరే — కిమ్మత్తు మొత్తమంతా యియందే నేనిక్కడ నుంచీ కదలను''—నిర్భయంగా జవాబిచ్చేడు.

గంగాధరం స్తంభించి పొయ్యాడు. వాడి నిర్లక్ష్యవైఖరి చూసి క్షణకాలం చలన రహితంగా నిల్చుండి పోయ్యాడు. మళ్ళీ అంతలోనే తేరుకున్నాడు. కోపంతో నిలువెల్లా అట్టుడికి పోయ్యాడు. విసురుగా ముందుకు కదిలి వాడిని ఒడిసి పట్టుకున్నాడు. బలమైన ఆ పట్టులో చిక్కుకుని గిజ గిజా తన్నుకుంటున్నాడు నారిగాడు.

తన యజమాని పురాయింపుతో పొడవైన తాడొకటి తీసుకొచ్చాడు పాపన్న. ఇద్దరూ కలిసి దగ్గరలోని ఒక వేప చెట్టుకు వాడిని కట్టివేశారు.

నారిగాడు మాత్రం తన పట్టు వదల్లేదు. కాగా మరింత ధైర్యాన్ని పుంజుకున్నాడు. గట్టిగా కేక లేశాడు. గొంతెత్తి శాపనార్థాలు పెట్టాడు.

''పేదోడి గోదు నీకు తగులుద్ది లేరా నన్ను కట్టిపడేసినా మా రత్తెమ్మ నీగుండెను చీల్సుద్ది లేరా. నీ వంశమారి పోనూ,నీ చేతులు పడిపోనూ!''

గంగాధరం వాడి మాటలు వినలేక పొయ్యాడు. మౌనంగా క్రిందకు వంగి వేపమండను చేతుల్లోకి తీసుకున్నాడు. కట్టిన వాన్ని కసితీరా బాదేశాడు.

నారిగాడు గుండెలవిసి పొయ్యేలా — వాతావరణం స్తంభించేలా ఏడుస్తున్నాడు. ఏడుస్తూనే నోటి తీట తీరేదాకా తిట్టిపోస్తున్నాడు. హృదయ విదారకమైన వాడిగొంతు పెరిగే కొద్ది గంగాధరంలో పశుత్వం ప్రకాశిస్తున్నదే కానీ హృదయం ద్రవించటం లేదు. చేతులు నొప్పి పుట్టినా బాదటం మాత్రం ఆపలేదు.

ఇంతకంటే నువ్వేం చేత్తావురా. ఒంటిగా దొరికిండానని చెట్టుకు కట్టేసి కొడుతుండావు. నన్నుగాదురా నువు కొడుతున్నది దరమాన్నే కొడుతుండావు. యమదరమ రాజునని మిడిసి పడుతుండావు నిన్ను తన్నేవాడు కూడామరొక డుంటాడురా. తన్నరా నాయ్యాలా తన్ను బొంగురు గొంతుకతో అస్పష్టంగా గొణుగుతున్నాడు.

''ఔనురా — యమదరమ రాజునే! చూడరా తడాకా''— ఈసారి గంగాధరం రాక్షసుడయ్యాడు. పగలబడి వెకిలి నవ్వు నవ్వుతూ వేప మండను సూటిగా వాడి ముఖంలోకి గుచ్చేశాడు.

''అమ్మో!—''పరిసరాలు ప్రతిధ్వనించేలా ఆర్తనాదం చేసి తల భుజం మీదకు వాల్చేశాడు నారిగాడు. క్రమేపి వాడి శరీరంలో చలనం స్తంభించింది.

ఈ హఠాత్తు పరిణామానికి గంగాధరం వెకిలి నవ్వు కూడా ఆగిపోయింది. ముఖంలో గుచ్చిన వేప మండను వెనక్కు లాగేశాడు. దాని వెనువెంటనే నారిగాడి కంఠిలోంచి రక్తం ధారగా ప్రవహించ సాగింది. క్షణంలో మనిషంతా రక్తంలో తడిసి ముద్దయి పొయ్యాడు.

గంగాధరం కాస్త తొట్రుపాటు పడ్డాడు. కంగారుగా వెనక్కు తిరిగి చూశాడు. పాపన్న ఆ దరిదాపుల్లో ఎక్కడా కన్పించలేదు. అతని గుండె దడ దడ లాడింది. మనస్సుకీడును శంకించింది. వెంటనే గోచీ పైకెగ దోపుకుని అక్కడనుంచీ పరుగు లంఘించుకున్నాడు.

* * *

నిశిరాత్రి పన్నెండు గంటల సమయం కన్నుపొడుచుకున్నా కానరాని కటిక చీకటి అంతులేని నైరాశ్యంలా, తిరుగులేని నియంతలా పరిసరాలను పాలిస్తుంది చీకటి.

భూమ్మీది చీకటి కంటే నల్లనైన కారు మేఘాలు ఆకాశం నిండా దట్టంగా వ్యాపించాయి. దిక్కులు పిక్కటిల్లే ఉరుములతోనూ వళ్ళు గగుర్పొడిచే మెరుపులతోనూ అప్పుడో యిప్పుడో కుంభవృష్టి ఆరంభమయ్యేలా వుంది వాతావరణం.

ఉదయం నుంచీ సాయంకాలం దాకా రెక్కలు ముక్కలయ్యేట్టూ కష్ట పడ్డ శ్రామికులు గూడెం పాకల్లో ఆదమరచి నిద్రిస్తున్నారు.

ఎక్కడో పిడుగు పడింది కాబోలు భూనభోంతరాలు దద్దరిల్లేలా ఘర్జించింది. ఆకాశం హఠాత్తుగా గూడెంలోకి చైతన్యం కదిలి వచ్చింది. తల్లులు పసిపిల్లలు వీపుల మీద చేతులు వేసి నిమర సాగేరు. మగాళ్ళు పైకి లేచి పక్కమీద కూర్చొని బీడీ ముక్కలు వెలిగించారు. ముసలాళ్ళు పొడి దగ్గు దగ్గుతునే ఆకూ వక్క కోసం తాంబూళం సంచులు విప్పసాగారు.

గూడెం లోని నడుమ వీధి చివరి పాక వాకిలి తెరుచుకున్నది. అందులోంచి బయటకు వచ్చిన స్త్రీ మూర్తీభవించిన దైన్యంలా ప్రాణం పోసుకున్న అస్థి పంజరంలా ముందుకు కదులుతున్నది.

ఆమె పేరు చిట్టి నారిగాడి భార్య. ఆకలి ఆకలంటూ మారాం చేసిన చిన్న పిల్లలను అతికష్టం మీద నిద్ర పుచ్చిందామె. సాయంకాలం దిబ్బ డబ్బుల కోసం గంగాధరం దగ్గరకు వెళ్ళిన నారిగాడు అర్ధరాత్రయినా తిరిగిరాక పోయ్యేసరికి ఆమె మనస్సుకీడును శంకిస్తూన్నది. ఒక వైపు ఆకలి కడుపును దహిస్తున్నా మగడు తిరిగి రాలేదన్న ఆదుర్దాతో వుండ బట్టలేక బయటకు వచ్చిందామె. రెండో వీధి లోని మొదటి పాకదగ్గర ఆగి వాకిలినెట్టింది.


"రత్తెమ్మా—రత్తెమ్మా"— గొంతెత్తి పిలిచింది.

చింకి కోక మీద ఒదిగి పడుకున్న రత్తి ఒరు—ఒరంటూ పైకి లేచి తలుపు తీసిమెరుపు వెలుగులో చిట్టిని చూసింది.

'ఏందక్కా— యీ యాలప్పుడు యిట్టా వత్తివి?—వానొచ్చేట్టుంది. దా—దా—లోపల కూకుందువుగాని"—

"ఆడు సందెకాడ దుడ్ల కోసం గంగాధరం గోరి దవ్వుకు పోయిండాయె రత్తీ. ఈ యాలైనా యింగా యింటికి తిరిగి రాలేదు. ఏమైందేదో టమోనే. నాకడుపులో గుబులుగా ఉండాది."

"ఎందీ—నారిగాడింగా ఇంటికి రానే దా?— వ



బొగ్గుపులుసు పెరిగితే..

మన వాతావరణంలో 2020 వ సంవత్సరాని కల్లా బొగ్గు పులుసు వాయువు వాతావరణంలో ఉండవలసిన దాని కన్నా ఎక్కువగా పెరగ వచ్చునని శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. దీనికి కారణం అడవుల్ని నిర్దాక్షిణ్యంగా కొట్టి వేయడం, ప్రతి సంవత్సరం పదిహేను నుండి ఇరవై బిలియన్ టన్నుల బొగ్గును కాల్చడం అని నిపుణులు చెప్తున్నారు. ఒకవేళ బొగ్గుపులుసు వాయువు ఇలా ఎక్కువగా పెరిగితే... తుఫానులు ఎక్కువగా రావడమో, ఋతుపవనాల దిశలు మారడమో, సముద్రంలోని ఆటు, పోట్ల తీరు మారి ఓడలు సముద్రంలో మునిగిపోవడమో జరగ వచ్చునని శాస్త్రవేత్తలు అంటు న్నారు. ప్రమాదమే మరి. ఈ ప్రమాదం నుండి తప్పించుకోవ డానికి మనం ఇప్పటినుండే ప్రయత్నాలు మొదలు పెట్టాలి.

—జూపిటర్

త్తా వత్తా దోవలో కించెత్తు సందేహపడితినే చిట్టక్కా ఆ మాయదారి గంగాధరం యిడిని పట్టు క కొట్టింటాడో ఎంటో పదపద చూద్దాం గానీ,''— అంటూ పాక తలుపు మూసి వీధిలోకి వచ్చిందామె.

రత్తి మాటలు పూర్తిగా అర్థం కాక పోయినా వౌనంగా ఆమెను అనుసరించింది చిట్టి దాంతో—తాను గంగాధరం పిట్టమడిలో నాట్లు వేయడానికి వెళ్ళిన దగ్గర నుంచీ జరిగిందంతా పూసగుచ్చినట్టు చిట్టికి చెప్పింది రత్తి.

ఇద్దరూ కలసి కూడ బలుక్కుని ఒకొక్కరినే పేపుతూ మాల పెద్దలందరినీ ఒక్క చోట కలిసారు. మాల పెద్దలు పది మందీ కలిసి వారు చెప్పిందంతా విన్న తరువాత అప్పటి కప్పుడే గంగాధరం తోటకువెళ్ళి నారిగాడి కోసం వెదకాలన్న ఏకాభిప్రాయాన్ని వ్యక్త పరిచారు.

వారా విధంగా నిర్ణయించిందే తడవుగా వాతావరణం మరో మలుపు తిరిగింది. అమాంతంగా జుయ్ మంటూ ప్రారంభమైన గాలి క్షణక్షణానికీ తీవ్రతరమై వేగాతి వేగంగా వీయసాగింది. ఆకాశంలోని మేఘాలన్నీ ఆ గాలి వెంట దూరంగా కొట్టుక పోసాగేయి.

పది మంది మాల పెద్దలు దుప్పట్లు కప్పుకొని గూడెం బయటకు నడువసాగేరు. వారి నడక వల్ల చెలరేగిన కలకలంతో నిదుర బెదిరి పైకి లేచిన మరి కొందరు మాలలు కూడా విషయం తెలుసుకుని వారిని అనుసరించారు.

వారందరూ గూడెం దాటేప్పటికి చూస్తూండగనే అక్కడ పెద్ద గుంపు ప్రోగయ్యింది. చిన్నా పెద్దా ముసలీ ముతక కాక నలభై మంది దాకా జట్టీల్లాంటి యువకులు కూడా ఆ గుంపులోవున్నారు.

అవసర సమయాల్లో వీరందరినీ సంఘటిత పరిచే శక్తి చిట్టిదే. ఆమె ముందు దారి తీస్తుంటే మిగతా వారంతా ఆమెను అనుసరిస్తున్నారు. కాస్సేపట్లోనే అందరూ కలిసి గంగాధరం తోట చేరుకున్నారు. రత్తి చేతుల్లోని లాంతరు వెలుగులో చెట్టుకు కట్టి వేయబడిన నారిగాణ్ణి కనుగొన్నారు.

వాలి పోయిన తలా—రేగి పోయిన జుత్తూ—పాలిపోయిన ముఖమూ—లొట్టపోయిన కన్ను— ఉబికిన పిక్కలూ—వాచిన జబ్బలూ—రక్త సిక్త మైన శరీరమూ—చైతన్య రహితమైన శరీరమా అది?

చిట్టెమ్మ కెవ్వున కేక వేసి రత్తి గుండెల్లో తలదూర్చి భోరున విలపించసాగింది. చూస్తున్న వారంతా ఎక్కడి కక్కడ స్తంభించి పొయ్యారు. క్షణంలోనే అక్కడ పెద్ద గగ్గోలు ప్రారంభమయ్యింది.

మాల పెద్దలు కార్యోన్ముఖులయ్యారు. వడివడిగా కట్లు విప్పి వాడిని మోసుక వెళ్ళి చేరువ లోని యిసుక తిన్నెపై పడుకో బెట్టారు. అనుభవమున్న ముసలివాళ్ళు కొందరుశ్వాసను పరీక్షిస్తున్నారు. మరికొందరు గుండెమీద చెయ్యి వుంచి నాడీ వేగాన్ని గణిస్తున్నారు. ఆడవారి హృదయాలు ద్రవించి కన్నుల నీరు తిరుగుతున్నాయి. ప్రక్కన నిల్చుని పరికించి చూస్తున్న పెద్దలు గంగాధరం పైశాచికత్వాన్ని నిర్విరామంగా తిట్టిపోస్తున్నారు. కాలు గాలిన పిల్లుల్లా అటూ యిటూ తిరుగుతూన్న యువకులు వళ్ళు తెలియని కోపంతో పే్ర్రేగిపోతున్నారు.

ఆవేదన కడలిలా పొంగుతూంటే ఆవేశం కట్టలు త్రెంచుకుంటున్నది. రెండూ కలిసి సరికొత్త రూపాన్ని సంతరించు కున్నాయి. ఫలితంగా ప్రతీకార జ్వాల వుప్వెత్తున లేచింది.

మిన్ను ముట్టే కేకల తోనూ దిశలు ప్రతిధ్వనించే యిలలతోనూ ముందుకు కదిలింది. జనసమూహం మూకుమ్మడిగా గంగాధరం పిట్టమడిలోకి చొచ్చుక వెళ్ళిపిచ్చి పిచ్చిగా కసి కసిగా దాన్ని సర్వనాశనం చేశారు.

అప్పట్లో వారందరి హృదయాల్లోనూ దెబ్బకు దెబ్బ వినాదం తీవ్రంగా ప్రతిధ్వనిస్తున్నది. పైశాచికత్వం ప్రకోపిస్తుండగా వశం తప్పిన మనస్సులతో మోటారుగది వైపు సాగిపొయ్యాడు. ఫలితం పంపు సెట్టు ముక్కలుముక్కలు అయ్యింది. కల్లం లోని రెండెడ్ల బండ్లు యిసుక

లయ్యాయి. పావురాయిల గుడిసెలు నేల మట్టమయ్యాయి. కోళ్ళ ఫారానికి వేయబడ్డ యినుప కడ్డీలను లాగివేశారు.

అయినా జనంలో ఆవేశం అనగారలేదు. వారి గుండెలు బండలయ్యాయి. మనస్సులు మరలయ్యాయి. శరీరాలు యంత్రాల్లాగా పనిచెయ్య సాగాయి. పశువుల పాకలో అడుగుపెట్టి అక్కడ కట్టివేయబడ్డ గొర్రె పొట్టేళ్ళను కూడా నరికి వేశారు.

అంతటితో ఆగలేదు. పిచ్చిగా చిందులేస్తూ కసిగా మరొకవైపుకు కదిలేరు. ఇప్పుడు వారి మనస్సు జొన్న తోట మీద లగ్నమైంది. దాని కంచెను తొలగించటానికి వుద్యుక్తులయ్యారు.

అంతలో — బిగ్గరగా కేకలేసుకుంటూ అక్కడికి వచ్చిన రత్తి వారి ప్రయత్నానికి అడ్డు తగిలింది. నోరులేని మూగజీవాలతోనూ పచ్చని పంట పొలాలతోనూ వైరం తగదని వారించింది. సాటి మనిషి అన్యాయం చేస్తే వారినే శిక్షించాలనీ, వాడి తాలూకే అయినా నోరులేని వాటి మీద చేయి చేసుకోవటం అవివేకానికీ అసమర్థతకూ నిదర్శనమనీ వాదించింది.

సరిగ్గా అప్పుడే నారిగాడిలో చలనం వచ్చిందంటూ మాల పెద్దలు కేకలు వేశారు. వెంటనే అందరి దృష్టీ అటు వైపు మళ్ళింది. ఆవేశం అణగారి ఆలోచన చోటు చేసుకుంది. మూకుమ్మడిగా గుంపంతా నారిగాడి చెంతకు చేరి వాడిని చుట్టుముట్టింది.


అప్పుడప్పుడే తేరుకుని మూల్గుతూ మూలుగుతున్న నారిగాడిని యక్షప్రశ్నలతో వేధించసాగారు. రత్తి కలుగజేసుకుని తీవ్రంగా మందలించటంతో కాస్తా సద్దుమణిగింది.

* * *

గూడెంలోని మాలలంతా గంగాధరం తోట మీదకు దాడి చేసి దాన్ని సర్వనాశనం చేశారన్న వార్తతో మరునాటి వుదయం గ్రామమంతా అట్టుడికి పోయింది. చావిడి దగ్గర నుంచీ రచ్చబండ దాకా ప్రతి మనిషీ ఈ విషయాన్ని గురించే మాట్లాడుతున్నారు. ఎవరికి వారు వ్యాఖ్యానిస్తున్నారు.

పరాభవాగ్ని మనస్సును తొలిచేస్తుంటే పరాజయం కన్నుల ముందు విలయతాండవం చేస్తుండగా పడక గదిలో కుప్పగా కూలిపోయ్యాడు గంగాధరం.

కాస్సేపటికి గ్రామ పెద్దలు ఒక్కరొక్కరే వచ్చి అతని చుట్టూ మూగసాగేరు. మెల్ల మెల్లగా కోలుకుంటూ గొంతు గొంతున విలపిస్తూ విషయమంతా వారికి విశదపరచ సాగాడు గంగాధరం. ఈ



సమస్య తన ఒక్కడిదే కాదనీ — కాకపోతే తనతో ప్రారంభం కావటం తన దురదృష్టమనీ విన్నవించుకున్నాడు. మాల లంతా కలిసికట్టుగా వ్యవహరించి రైతాంగానికీ శ్రామిక వర్గానికీ మధ్య తీవ్రమైన విభేదాలను సృష్టించి రెక్కల కష్టానికి రెట్టింపు ఫలితం పొందాలని ఆశ పడుతున్నారనీ తాత్కాలికమైన విభేదాలను మరచి రైతులందరూ ఏక త్రాటి మీద నడవకపోతే వారి సవాలును ఎదుర్కోవటం సాధ్యపడదనీ మరీ మరీ ప్రాధేయపూర్వకంగా మనవి చేసుకున్నారు. అంతా విని గ్రామపెద్దలు బరితెగించిన మాలల దురహంకారానికి తగిన శాస్తి చెయ్యందే నిదుర పోరాదని ఏకగ్రీవంగా నిర్ణయించారు.

గంగాధరం అమాంతంగా ధైర్యాన్ని పుంజుకున్నారు. కాలరు సవరించుకొని కండువా భుజం మీదకు లాక్కున్నాడు. సగర్వంగా తల ఎత్తుకొని బంధు కోటీ మిత్రకోటీ ఒక్కరేమిటి గ్రామంలోని మోతుబరి రైతులందరూ వెంటరాగా తోట కేసి బయలు దేరారు.

పగిలిన పంపు సెట్టూ — తునకలైన ఎడ్ల బండ్లూ — తలలు తెగిన గొర్రె పొట్టేళ్ళు — విరిగి పడ్డ యినుప కడ్డీలూ — భూమిలోకి త్రొక్కివేయబడ్డ వరి మొక్కలూ — ఒకటేమిటి రాత్రి జరిగిపోయిన విధ్వంస కాండను చూస్తున్న కొద్దీ చూపరులంతా కోపంతో పేట్రేగిపోయారు. జరిగిన నష్టాన్ని బేరీజు వేస్తూ హృదయ పూర్వకమైన సానుభూతిని వ్యక్తం చేశారు. పరిపూర్ణమైన మద్దతు ప్రకటించారు.

నిత్యమూ శ్రమిస్తూ అమ నిత్యమూ తమ చెప్పుచేతల్లో వుండాల్సిన మాలలు ఈ విధంగా బరితెగించి తిరుగుబాటు చెయ్యడం భారతీయ గ్రామీణ చరిత్రకే కళంకమంటూ వాపొయ్యారు.

వళ్ళు తెలియని కోపంలో నాలుగు తగిలించి వంత మాత్రాన అందరూ కలిసి కట్టుగా వ్యవహరించి ఒక సంఘటిత శక్తిగా విరుచుకు పడటం భూస్వాములందరూ తీవ్రమైన అప్రతిష్టగా తల పోశారు. ఈ విషయంలో కలిసి కట్టుగా వ్యవహరించక పోతే మాలల ఆగడాలకు హద్దుండదనీ కనుక వెంటనే తమలోంచీ ఒక కార్యాచరణ సమితి ఏర్పాటు అయి తిరిగి కోలుకోలేని విధంగా వారిని అణచి వేయాలనీ నిర్ణయించారు.

అంతా విన్న గంగాధరం ముని కాళ్ల మీద పైకి లేస్తూ కాలుతున్న చుట్టకు మరోసారి నిప్పంటించి గుండెల నిండా పొగ పీల్చాడు. మాలవాడకు నిప్పంటించడమే ప్రతీకారానికి ఏకైక మార్గమంటూ కాల నాగులా బుస కొట్టాడు. వారి అహంకారానికి చితి పేర్చందే తాను నిదురపోనని మరోసారి స్పష్టం చేశాడు.

తీవ్రవాద మోతుబరీ భూస్వాములంతా గంగాధరం ప్రతి వాదనను ఏక కంఠంతో ఆమోదించింది. అప్పటి కప్పుడే క్షణాల మీద పని జరిగిపోవాలనీ ఆ తరువాత ఎదురయ్యే విపరీత విపత్కర పరిణామాల నన్నింటినీ సామూహికంగా ఎదుర్కోవాలనీ అందుకు అవసరమైన ఖర్చును కూడా చందాలు వేసి భరించాలనీ తీర్మానించారు. కార్యక్రమంలో మొదటి ఘట్టంగా దహనకాండకు అవసరమైన కిరసనాయిలు, అగ్గిపెట్టె వగైరా సామాగ్రి వైశ్య వర్గం నుంచి వసూలు చెయ్యాలని నిర్ణయించారు.

అంగ బలమూ, అర్థ బలమూ, రెండూ తోడయ్యేసరికి గంగాధరం వుప్పొంగిపొయ్యాడు. మిన్నుముట్టిన ఆనందంతో కాలరు సవరించి బీడీ ముక్క వెలిగించాడు. ఆ సాయంకాలమే పాకలకు నిప్పు పెట్టాలనీ — విషయాన్ని మాత్రం రహస్యంగా వుంచాలనీ అందరికీ పేరు పేరునా మనవి చేశాడు.

ఇంతలో ప్రెసిడెంటు పుల్లం రాజు అక్కడకు వచ్చాడు. అందరి దృష్టి ఆయన వైపు మళ్ళింది. గంగాధరం జరిగిన విషయం ఆయన కూడా ఎరుక పరచాలని పెదవి విప్పబోయాడు.

"ఇంటికాడే అంతా విన్నాన్రా. ఏం చెయ్యాలన్నది కూడా ఆలోచించుకునే వచ్చాను. నా మాట వింటామంటే పరిష్కారం కూడా చెబుతాను" — గంగాధరం నోటి మంచి మాట రాక ముందే గబగబా చెప్పేశాడు పుల్లం రాజు.

"చాల్లేవయ్యా!" పరిష్కారమంటూ ఆ మాల



ముండా కొడుకుల్ని మా నెత్తి కెక్కిస్తే మాత్రం వూరుకోము. ఎలక్షన్లలో నిలబడే వాడెప్పుడూ పాము చావరాదు. కట్టె విరగ రాదంటూ యిరువర్గాలకీ ఒక క్వశ్చన్ మార్కై అవుతుంటారు. మా నిర్ణయమేదో మేము చేసుకున్నాము. మీరు ఎటూ కలుగ చేసుకోకుండా ఊరకుంటే చాలు!'' కండ బలమున్న ఒక యువరైతు కస్సుమన్నాడు.

''ఔను పుల్లంరాజూ! — మాల వాడకు నిప్పెట్టాలని నిర్ణయించిండాము. ఈ యిసయంలో వూరు వూరే కట్టుకొచ్చిండాది. నువ్వు కూడా సరే నంటే యిక అడ్డే లేదనుకో'' అర్థిస్తున్నట్లుగా అన్నాడు గంగాధరం.

''తొందర పడకు గంగాధరం. వేగం ఎక్కువైతే ప్రమాదం తప్పదు. నేను మాత్రం రైతును కాదా? నాకు మాత్రం ఈ అవమానంలో బాగం లేదనుకున్నావా? కాకపోతే కండకు కాక బుద్ధికి పదును పెట్టాల్సిన రోజులివి. ప్రభుత్వం హరిజనులకీ, గిరిజనులకీ చట్టబద్ధమైన రక్షణ లెన్నో కల్పిస్తున్న ఈ రోజుల్లో — మనమంతా మూక వుమ్మడిగా దాడి చేసి కొంపల్ని కాల్చామంటే — ఆ తర్వాత వూరు వూరంతా పునాదుల్తో లేచిపొయ్యే ప్రమాదముంది. సాయుధ పోలీసు బలగాలు సంవత్సరాల పర్యంత మూ గ్రామంలో తిష్ట వేసి దుక్కల్ని కూడా దోమలుగా మార్చే అవకాశమున్నది. భూకంపమే వస్తుందో — జల ప్రళయమే సంభవిస్తుందో అంచనా వేయలేము.

అందువల్ల మన చేతులకి తడి కాకుండా వారి అహంకారానికి తగిన శాస్తి చేయాలి. జరిగిపోయిన విధ్వంస కాండ ఆధారంగా పోలీస్ స్టేషన్లో ఒక రిపోర్టు పడేస్తే సరి. ఆ రిపోర్టును మన గ్రామ మునసబు సపోర్టుగా నిలిస్తే అది యిండియన్ పీనల్ కోడ్ 395 సెక్షన్ క్రింద కేసు రిజిష్టరయి కూచుంటుంది. కోర్టులో కన్ఫ్యూజు కాకుండా జవాబు చెప్పగలిగే సాక్షుల్ని వేసుకుంటే, జిల్లా కోర్టుకు ముప్పయి వాయిదాలు తిరిగాక నిందితులకి రెండు నుంచి పది సంవత్సరాల దాకా శిక్ష పడి తీరుతుంది. వాయిదాలకు తిరగటంలోనే మాలవాడ సగం అరిగిపోతుంది. అనేక జైలు శిక్షలంటే యిక చెప్పనవసరమే లేదు. అంతా సవ్యంగా జరిగితే మూడు నాలుగు తరాల దాకా తిరిగి కోలుకోలేని విధంగా అణచి వేయబడుతాయి.

ఈ బృహత్తర కార్యక్రమానికి ఖర్చు కాస్త ఎక్కువే అవుతుంది. అది కూడా మనం చందాలు వేసుకుని భరించ నవసరం లేకుండా వుపాయం ఆలోచించుకునే వచ్చాను.

ప్రభుత్వ సారాయి దుకాణాల్ని మారు వేలం వేయగా లభించిన మొత్తాన్ని పోలీసు వారికి చెల్లించాల్సిన మామూళ్ళకి వాడవచ్చు. చిల్లరోళ్ళ తగాదాల్ని పంచాయితీ చేసినప్పుడు వసూలు చేసిన అపరాధ రుసుమంతా లాయర్ ఫీజులకి వుపయోగించవచ్చు. సాగునీటి తీరవల్లో ఛేకూరిన కుంట్ల తాలూకు మొత్తమంతా కోర్టు వాయిదాల కోసం వినియోగించవచ్చు.

''నేను చెప్పిన ఈ పంథా మీ అందరకూ నచ్చే పక్షంలో వెంటనే మనం అందుకు ఆయత్తం కావాలి'' చెప్పేది ఆపేసి అందరికేసీ పరికించి చూశాడు పుల్లంరాజు.

''ఆహా — మీ ఆలోచన దివ్యంగా వుంది, యిక మాకే అభ్యంతరమూ లేదు. ఊరకే అన్నారా? — మెదడుకు పదునుంటే సూర్యుడి గుండె కూడా చీలుస్తుందని'' ఒక తల పండిన మోతుబరీ రైతు పుల్లంరాజు ప్రతిపాదనని గట్టిగా బలపరచాడు.

''మరి నీ మాటేమిటి గంగాధరం?'' — నష్టపోయింది నువ్వే కనుక మా అందరి ఆలోచనలూ ఎలా వున్నా నీ అభిప్రాయమే అమలు జరగాలి'' గంగాధరం కేసి చూస్తూ ప్రశ్నించాడు మునసబు ముకుందరావు.

''అబ్బే — నాదే ముండాది. ఆలోచన్లు చెప్పాల్సినోల్లు మీరుండగా నేనేం చెప్పేది? మీ అందరి యిష్టమే నా యిష్టమూ. ప్రత్యేకించి అడగాలా ఏంటి?'' అన్నాడు గంగాధరం.

''అయితే పుల్లంరాజు చెప్పినట్లే చేద్దాం. అతని ఆలోచనే సరియైనదిలా అన్పిస్తూంది'' అంటూ పైకి లేచాడు ముకుందరావు.

అందరి వైపూ సంతృప్తికరంగా చూస్తూ తల

పంకించాడు. పుల్లంరాజు ఆనక గంగాధరాన్ని ప్రక్కకు తీసుకెళ్ళి కేసు బలపడాలంటే ఒక నెత్తురు గాయం కూడా అవసరమని చెప్పాడు.

గంగాధరం తీవ్రంగా ఆలోచించాడు. మెరపు లాంటి ఆలోచన తళుక్కు మనగా — తన మేనల్లుడు వీరాంజనేయుల్ని పిలిపించి తన పథక మంతా వివరించాడు. అందుకు అతనొక్కడే సమర్థుడంటూ ఆకాశానికెత్తేశాడు.

కిమ్మనకుండా మామగారి ఆదేశాన్ని శిరసావహించాడు ఒక పొడుగాటి రాయి తీసుకొని నుదుటికేసి బలంగా కొట్టుకున్నాడు. తగిలిన గాయం నుంచీ ధారాపాతంగా కారుతున్న రక్తంతో కట్టుకున్న గుడ్డల మీద మరకలు చేసుకున్నాడు.

గంగాధరం అతని భుజం చరిచి కాస్త బాధని పంచివా భరించ వలసిందిగా మనవి చేశాడు. అతని త్యాగనిరతిని మనసారా అభినందించాడు.

ఆ తర్వాత పుల్లంరాజూ, ముకుందరావు, వీరాంజనేయులే కాక మరి కొందరు మోతుబరి రైతులు కూడా తోడు రాగా తాలూకా కేంద్రానికి బయలు దేరాడు గంగాధరం.


అక్కడికి చేరగానే వీరాంజనేయుల్ని తీసుకెళ్ళి ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. మెడికల్ ఆఫీసర్ పుల్లంరాజుకు సన్నిహితుడైనందున ఆయన్ని కలిసి కాస్త ఎక్కువ మొత్తాన్నే ముట్ట జెప్పారు. నోట్ల కట్టలతో జేబు నింపేసుకున్నాక, పోలీసు వారి చర్యకు కావలసినంత బలాన్నివ్వగల సర్టిఫికేట్ రాసివ్వడానికి ఒప్పుకున్నాడాయన.

ఇనుప చువ్వతో బాదటం వలన తల మీద బలమైన గాయం తగలటమే కాక, శరీర మంతటా కూడా మూగి దెబ్బలు పడ్డట్టు పేర్కొన గలనని హామీ యిచ్చాడు.

డాక్టర్ నుంచి అవసరమైన సహకారం పొందగల మని ఋజువయ్యాక అందరూ కలిసి పుల్లంరాజుకు బాగా తెలుసున్న ఒక ప్రముఖ న్యాయవాదిని కలుసుకున్నారు. ఆయనకు విషయమంతా వివరంగా ఎఱుకపరచి పోలీసు ఫిర్యాదుకు అవసరమైన గట్టి సాక్ష్యాధారాలు పొందు పరుస్తూ — పటిష్టమైన రిపోర్టు తయారు చేయించారు.

ఆనక తాలూకా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఇన్స్‌పెక్టర్‌ను కలుసుకున్నారు.

క్రితం రోజు అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో (వారము, తేది మొదలైన అంశాలు కూడా జత పరిచారు) సాయుధులైన దుండగుల గుంపొకటి తన తోట మీద ఆకస్మికమైన మెరపు దాడి చేసిందనీ — తోటలో నిద్రిస్తున్న తన మేనల్లుడినీ, యిద్దరు పాలేళ్లనూ, మరి ముగ్గురు దినసరి కూలీలనూ (వారి పేర్లను కూడా పొందు పరిచారు) — తమ వెంట నున్న నాటు బాంబుల సహాయంతో బెదరించి మారేడు చెట్లకు కట్టి వేశారనీ — ఆ తరువాత అక్కడున్న పదమూడు గొర్రె పొట్టేళ్ళనూ — విలువైన వ్యవసాయ పనిముట్లనూ — విద్యుత్ మోటారు స్టార్టరునూ పట్టుక పోతుండగా — ఆ దౌర్జన్యాన్ని భరించలేక కేకలెయ్య బోయిన తన మేనల్లుడిని చితక బాది — అంతటితో ఆగక పంపు సెట్టును పగులగొట్టి — ఎడ్ల బండ్లను విరగ్గొట్టి — కోళ్ళ ఫారం గోడలు కూల్చదోసి — ఆ రోజే తిరగ నాటిన వరి మొక్కలను భూమిలోకి త్రొక్కి వేయటమే కాక నానా హంగామా చేసి — వారికి కావాల్సిన వస్తువులను పట్టుకపోయ్యారనీ — ఆ గుంపులో మొత్తం ముప్ఫయి మంది బలిష్టులున్నారనీ వారందరూ తమ సొంత గ్రామానికి చెందిన



తాళం

"అదేవిటయ్యా నేను కీర్తన అందుకుంటే అలా తలుపులు వేస్తున్నావూ" కంగారుగా అన్నాడు సంగీతం మాష్టారు శిష్యుడితో.

"మీరే కదండీ అన్నారు. కీర్తన చెబుతూ వుంటాను తాళం వెయ్యమని చెప్పి" అమాయకంగా అన్నాడు శిష్యుడు.

—డి.సీతాదేవి (తెనాలి)

మాలవాడ ప్రజలేననీ — చెట్లకు కట్టివేయ బడ్డ వారు కళ్ళంలోని విద్యుత్ దీపం వెలుగులో వారెవ రైందీ విడివిడిగా స్పష్టంగా గుర్తు పట్టేశారనీ — పోలీసు అధికారులు మెరపుదాడి చేస్తే — మాల వాడలోని నేరస్తుల స్వగృహాల్లో ఈ విధ్వంస కాండకు ప్రత్యక్ష సాక్ష్యాధారాలు లభించగలవనీ — పేర్కొన టమే కాక — ముప్పయి మంది నిందితులను కూడా వారి యింటిపేరూ తండ్రి పేర్లతో సహా విడివిడిగా వారందరి పేర్లూ కనపరచారు.

రిపోర్టులో పొందుపరచిన పై విషయాలా ధారంగా పోలీసు ఇన్‌స్పెక్టరు దగ్గర ఫిర్యాదు నమో దు చేశారు. వ్రాత మూలకమైన ఫిర్యాదే కాక, తనకు జరిగిన అన్యాయాన్ని చిలవలు పలవలుగా వ ల్లిస్తూ — కళ్ళ నీళ్ళతో ఆయన ముందు ఏకరువు పెట్టాడు గంగాధరం. అవసరమైన పోలీసు బల గంతో వెంటనే తమ గ్రామాన్ని సందర్శించి న్యాయం కలుగ చెయ్యాలని మనవి చేశాడు కఠినమైన చర్యలు తీసుకోని పక్షంలో తామా గ్రామంలో కాపురం చెయ్యలేమంటూ వచ్చిన రైతులందరూ కూడా మూక వుమ్మడిగా మొరపెట్టుకున్నారు.

భయపడ నవసరం లేదంటూ — వారికి తన సంపూర్ణ మద్దతును ప్రకటించి — ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్ళి వీరాంజనేయులు దగ్గర స్టేట్ మెంటు రికార్డు చేశాడు ఇన్‌స్పెక్టర్.

స్టేషన్‌కు తిరిగి వచ్చాక తొలి నివేదిక తయారు చేశాడు. గంగాధరం తోటలోకి నిందితులు అక్ర మంగా ప్రవేశించి అడ్డు వచ్చిన వీరాంజనేయుల్ని చితకబాది — దోపిడీ చేసినట్లు స్పష్టమౌతూన్నం దున ఈ మూడు నేరాల్నీ వరుసగా ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 395, 335 మరియు 447 సెక్షన్ క్రింద నమోదుచేసి, వాటి నకళ్ళను ఉన్నతాధికారులకు పంపించారు.

ఈలోగా పుల్లంరాజు నమ్మకస్తులైన యిద్దరు రైతులు ఏకాంతంలోకి తీసుకు వెళ్ళి ఇన్‌స్పెక్టర్ వూళ్ళోకి వచ్చేలోగా జరుగవలసిన తతంగాన్నంతా వివరించి చెప్పాడు. ఒక టాక్సీ బేరం చేసి అప్పటి కప్పుడే వారిని స్వగ్రామానికి పంపి వేశాడు.

ఊళ్ళోకి వెళ్ళిన రైతులిద్దరూ పోలీసులకిచ్చిన ఫిర్యాదులను గూర్చి గ్రామంలో బాగా ప్రచారం చెయ్యటమే కాక పోలీసులు వచ్చి మొత్తం మాల వాడనంతా కష్టడీలోకి తీసుకోనున్నట్లుగా పుకారు లేవదీశాడు.

ఏ నేరమూ చెయ్యక పోయినా కాకి బట్టలు చూస్తే చాలు ఆమడ దూరం పరిగెత్తే అమాయ కులు మాలవాడ ప్రజలు. ఇక యిలాంటి దశలో పోలీసు దాడిని గూర్చి వింటే వారి విషయము చెప్పనక్కర లేదు. భయ భ్రాంతులై అయో మయంలో పడిపొయ్యారు. చాలా మంది అప్పటి కప్పుడే తమ తమ యిళ్ళను వదలి కొండగుట్టల్లోకి పరారు అయ్యారు.

చీకటి పడుతుండగా ఆడవాళ్ళందరూ కూడా యిళ్లకు తాళాలు వేసి విడివిడిగా లేకుండా ఒకే చోటికి చేరుకున్నారు. ఒకరి కొకరు ధైర్యాన్ని చెప్పుకుంటూ అందరూ అక్కడే పడుకున్నారు.

ఆ రాత్రి — అర్థరాత్రి — కన్ను పొడుచు కున్నా కానరాని కాళరాత్రి — ఆకాశంలో మబ్బులు ముసురుకొని ముందుకు సాగుతుంటే దారి కిరువైపు లా దట్టంగా ఆవరించిన ముళ్ళ పొదల్లోంచి కీచురాళ్లు గీపెడుతుంటే దూరంగా చింత తోపు లోని తీతువు పిట్ట వుండి వుండి అరుస్తుంటే — దుప్పట్లు కప్పుకున్న ఐదు మంది జట్టీల్లాంటి రైతు యువకులు యివేవీ లెక్క పెట్టకుండా టార్చి వెలుగులో చీకటిని చీల్చుకుంటూ ముందుకు సాగుతున్నారు.

మాలవాడలో ప్రవేశించి పోలీసు ఫిర్యాదులో పేర్కొన్న మొదటి ముద్దాయి పాక దగ్గర ఆగి పొయ్యారు. ఆ యింటి పరిసర ప్రాంతాల్లో మరో నలుసు లేదని తేల్చుకున్నాక — తమ చెంత నున్న తాళం చెవుల గుత్తి నుంచీ సరైన దాన్నెన్నుకొని — పాక తలుపు కేసున్న తాళం వూడదీశారు.

దుప్పట్ల మాటున దాచుకున్న నాటు బాంబులు తీసుకెళ్ళి పాకలోని గింజల కాగులో దాచారు. ఆ తర్వాత వడివడిగా బయటకు వచ్చి వాకిలి మూసి

తాళం వేశారు.

అల్లాగే మరి కొందరు ముద్దాయిల పాకలను కూడా తాళాలు వూడదీసి కొందరిళ్లల్లో గొర్రె పొట్టేళ్ళ తడి చర్మాల్ని దాచారు.. మరి కొందరిళ్ళ లోకి గంగాధరం తాలూకూ వేనని ఋజువు కాగల చిన్న చిన్న వ్యవసాయ పనిముట్లను చేరవేశారు. ఆనెక తృప్తిగా గాలి పీల్చుకుని మాలవాడ దాటి విజయ గర్వంతో వూళ్ళోకి అడుగు పెట్టారు.

* * *

తెల్ల వారుతుండగా రెండు వ్యానుల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ దళం వూళ్ళోకి వచ్చేసింది. ఇన్‌స్పెక్టర్ మాత్రం ఆరు మంది లోకల్ కానిస్టేబుల్స్‌తో సహా జీపులో వచ్చాడు.

వచ్చీ రాగానే అందరూ గంగాధరం తోటకు వెళ్ళారు. ఇన్‌స్పెక్టర్ అక్కడి పరిస్థితి నంతా ఎంతో ఓపిగ్గా తనిఖీ చేశాడు. జరిగి పోయిన విధ్వంస కాండను ఋజువు చేస్తూ బోలెడన్ని ప్రత్యక్ష సాక్ష్యాధారాలు లభించేప్పటికి ఆయన ప్రళయ కాళ రుద్రుడయ్యాడు.

నిందితుల నందరనూ మూకుమ్మడిగా అరెస్టు చెయ్యవలసిందిగా తన సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాడు. సాయుధ పోలీసు బలగాలు మాలవాడ వైపు సాగిపొయ్యాక పరిస్థితినంతా మరోమారు నెమరు వేసుకున్నాడు.

ఇన్స్‌పెక్టర్ దగ్గర నుంచీ వెళ్ళిన పోలీసులు మాల వాడకెళ్ళి ముద్దాయిల కోసం గాలించారు. గూడె మంతా ఖాళీగా వుండటం చూసి ఎక్కడికి పరారయ్యిందీ తెలుసుకోవటానికి శతవిధాలా ప్రయత్నించారు. పరిసర ప్రాంతాలన్నింటినీ వెదకి వెదకి విసిగి పొయ్యారు. చేసేది లేక ఖాళీగా తిరిగి వచ్చి ఇన్‌స్పెక్టర్‌కు పరిస్థితి వివరించారు.

అంతా విన్న ఇన్‌స్పెక్టర్ శూన్యంలోకి చూస్తూ కాస్సేపు నిర్లిప్తంగా వుండి పొయ్యాడు. ఈ లోగా కొందరు రైతులు ఉపాహారమూ, కాఫీలు పట్టుకొచ్చారు. వాటిని స్వీకరించటానికి ఇన్‌స్పెక్టర్ గట్టిగా నిరాకరించాడు.

ఆ వూళ్లో పూటకూళి ఫలహార శాలలు లేవనీ, వీటిని ఏ వర్గానికీ చెందని గ్రామ పెద్దలు మాత్రమే వండించారనీ — గంగాధరానికి ఈ వంటకాలతో ఏలాంటి సంబంధమూ లేదనీ, అనేక విధాల నచ్చ చెప్పాక వీటిని స్వీకరించడానికి అంగీకరించాడాయన.

కానిస్టేబుల్స్ అందరూ ఆహారం సేవించి కాఫీలు సిప్ చేస్తుండగా తనూ కాఫీ చప్పరించి సిగరెట్ వెలిగించాడు ఇన్‌స్పెక్టర్. ఆయన మనస్సులో మెరపులాంటి ఆలోచన మెదిలింది. వెంటనే పంచాయతీ ప్రెసిడెంటునూ, గ్రామ మునసబ్‌నూ మరి కొందరు గ్రామ పెద్దలనూ వెంట తీసుకుని మాలవాడకు వెళ్ళాడు. ముద్దాయిల పాకలకు వేసున్న తాళాలను చూచి వారి సమక్షంలో వాటిని పగల గొట్టించి యిళ్ళను సోదా చేయించాడు.



**ఆరవ బీద దేశం**

మన దేశం పేద దేశమనేది నిర్వి వాదాంశం. అయితే పేదరికంలో ఎన్నో స్థానాన్ని ఆక్రమిస్తుందనేది... అసలైన ప్రశ్న. ఈ మధ్యనే సేకరించిన సమాచారాన్ని బట్టి తలసరి జాతీయ ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రపంచంలోని పేద దేశాల పట్టికను ఓ సంస్థ తయారు చేసింది. ఆ పట్టికలో మనం ఆరవ స్థానంలో ఉన్నామట. ఎంతో డాంబికంగా అణు పరీక్షలూ, అంతరిక్ష పరిశోధనలూ, అంటార్కిటికా యాత్రలూ జరుపుతున్న మనం... పేదరికాన్ని రూపు మాపడానికి కూడా ఇలాంటి బృహత్తర ప్రణాళికల్ని రూపొందించుకొంటే బాగుంటుందేమో! దేశ నేతలూ... ఆలోచించండి?

—జూపిటర్

మొదటి ముద్దాయి యింట్లో నాటు బాంబులు దొరికాయి. మిగిలిన ముద్దాయిల యిళ్ళల్లో పొట్టేలు చర్మాలూ — గంగాధరం తాలూకు వ్యవసాయ పనిముట్లు లభ్యమై వారి నేరాన్ని సాక్ష్యంగా ఋజువు పరిచాడు. వచ్చిన పెద్ద మనుష్యుల సహకారంతో పంచాయతీనామా చేసి ఆ వస్తువుల నన్నింటినీ స్వాధీన పరచుకున్నాడు.

ఆనక గ్రామ చావిడికి తిరిగి వచ్చి జరిగిన సంఘటనలను గూర్చి సుదీర్ఘంగా ఆలోచించాడు. సమాజంలో అట్టడుగున వుండి పోయిన జాతుల నన్నింటినీ — శిఖరాగ్రం మీదకు తీసుక రావాలనీ — ప్రభుత్వం వారికి లెక్క లేనన్ని రాయితీలను ప్రకటించింది. అవసరానికి మించిన ప్రత్యేక రక్షణను ఏర్పాటు చేసింది. వాటిని సద్వినియోగం చేసుకోకపోగా, చట్టాన్నే ధిక్కరించి ప్రభుత్వ పాలసీనే మర్డర్ చేసిన ఈ గుండాయిజాన్ని మాత్రం క్షమించ రాదన్న ధృడ నిశ్చయానికి వచ్చాడు. తాను కళ్ళారా చూచిన నిజాన్ని, మండుతున్న గుండె నుంచీ జాలు వారిన లావాలో రంగరించి, ఒక నివేదిక తయారు చేసుకుని దాన్ని అప్పటి కప్పుడే పై అధికారులకు పంపివేశాడు.

మరునాటి సాయంకాలం దాకా ఆయన అక్కడే వుండి పొయ్యాడు. నిందితులను అరెస్టు చెయ్యాలని తన శాయ శక్తులా ప్రయత్నించాడు. సమీప ప్రాంతాల్లో దొరికిపోయిన మాలవాడ స్త్రీ, బాల, వృద్ధులను నిర్బంధంలోకి తీసుకున్నాడు. వారినుంచీ ఆచూకీ రాబట్టాలని ప్రయత్నించాడు. నయానా చెప్పి చూశాడు. గుడ్లెర్ర చేసి లాఠీ పైకెత్తి హుంకరించాడు. లాభం లేకపోయింది. దండన కూడా మొదలు పెట్టాడు. వారి కండ్లు అశ్రువులను వర్షించాయి. గొంతు మాత్రం పెగల్లేదు.

నిందితుల ఆచూకీ అంతు బట్టదని తేలిపొయ్యాక ఆయనలో పట్టుదల పెరిగిపోయింది. అర్మ్‌డ్ రిజర్వ్‌ను అక్కడే వుంచాడు. రాత్రింబగళ్ళూ గూడెం చుట్టూ కాపలా కాయమన్నాడు. లోపలకు రావటానికి ప్రయత్నించిన వారిని అరెస్టు చేయమని ఆదేశాలు జారీ చేశాడు. ఒక సీనియర్ హెడ్ కానిస్టేబుల్‌ని వారికి తోడు వుంచి ఆయన స్టేషన్‌కు వెళ్ళిపొయ్యాడు.

* * *

ఒక నెల రోజులు గడచిపొయ్యాయి. గూడెం దగ్గర పోలీసు కాపలా అలాగే వుంది. పరారీ లో వున్న వారెవ్వరూ గూడెంలోకి రావటానికి సాహసించ లేదు. స్త్రీలు మాత్రం మెల్ల మెల్లగా యిళ్ళకు తిరిగి వచ్చారు. వచ్చిన వారి నందరినీ పోలీసులు బెదిరిస్తూనే వున్నారు. ముద్దాయిల జాడ తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఇన్‌స్పెక్టర్ కూడా మరో రెండు సార్లు వూళ్ళోకి వచ్చి వెళ్ళాడు. ఆయన వచ్చినప్పుడల్లా గ్రామ పెత్తందార్లంతా ఆయన చుట్టూ చేరి ఏదో ఒక నేరారోపణ చేస్తూ ముద్దాయిల పట్ల ఆయన వైఖరి తీవ్రతరమయ్యేలా చేస్తున్నారు.

పరారైన మగవాళ్ళందరూ చుట్టు ప్రక్కల గ్రామాల్లోని తమ బంధువుల ఆసరాతో పొట్ట పోసుకుంటున్నారు. పొరుగు గ్రామాల్లో చుట్టు పక్కాలు లేని స్త్రీలూ, కొందరు వృద్ధులూ గూడెం వదిలి గూళ్ళకు తిరిగి వచ్చారు. ఏం చెయ్యాలో పరిస్థితి నెలా చక్కదిద్దుకోవాలో వారికర్థం కావటం లేదు. కేసులో వున్న ముద్దాయిల సంఖ్య కూడా యిదమిద్ధంగా తెలియటం లేదు. ఎవరికి వారు తామంతా కూడా కేసులో వున్నామన్న భ్రాంతిలో పడిపొయ్యారు.

మనదేశంలోని శ్రామిక వర్గంలో అక్షరాస్యుల సంఖ్య చాలా తక్కువ. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం కార్మిక లోకమంతా నిరక్షరాస్యులే. అంతే గాక వారు తమ నివాసాల పరిసరాలు దాటి బయటకు వచ్చే అవకాశాలు మృగ్యమైనందున, బయట ప్రపంచమెలా వుంటుందో కూడా తెలియని అమాయకులు గానే మిగిలిపొయ్యారు. ఒకరిద్దరు కాస్తా చదువుకున్న వారున్నా వారు కూడా సంతకం పెట్టే దశ నుంచీ పైకి ఎదగలేదు. అంతే కాక యిది వర్గ సంఘర్షణగా రూపు దిద్దు కొన్నందున మిగతా గ్రామాల్లోని రైతాంగం సైతం వీరికి తమ మద్దతును ప్రకటించటం లేదు. సానుభూతి చూపకపోగా వారు కూడా వీరిని తమ శత్రువులు గానే

పరిగణిస్తున్నారు.

ఇదిలా వుండగా గూడెంలోకి తిరిగొచ్చిన ఆడవాళ్ళందరికీ పోలీసు భయం పట్టుకుంది. వారు మెదిలితే చాలు నేరస్థుల కూపీ లాగాలని పోలీసులు ప్రయత్నిస్తూనే వున్నారు. చాలా మంది స్త్రీలు ఎప్పుడో తప్ప తమ యిళ్ళనుంచీ బయటకు రావటం కూడా మానివేశారు. పనులన్నీ మానుకొని నైరాశ్యంతో జీవితాన్ని నెట్టుకొస్తున్నారు.

రెక్కాడితే గానీ డొక్కాడ ని దశ వారిది: నిత్యమూ శ్రమిస్తూ దినసరి కూలి డబ్బులతో ఏపూట కాపూట పొయ్యి రాజేస్తుండే వారు. ఇన్ని రోజులు నుంచీ పని పాటలు లేక ఖాళీగా వుండిపోయ్యే సరికి బత్తెం గింజలులేక చాలా మంది ఆకలితో మాడిపోయ్యే దశవచ్చింది. గుండె రాయి చేసుకొని పనిలోకి వెళ్దామని ప్రయత్నించినా వూళ్ళోని రైతాంగమంతా వీరిని తమ పొలాల్లోకి రాకుండా మూకుమ్మడి నిషేధాన్ని ప్రకటించారు.

ఆడవాళ్ళు ఒంటరిగా కన్పిస్తే సూటి పోటి మాటలతో వేధిస్తున్నారు. వేళకు సరిగా తిండి దొరకని పసిపిల్లలు హృదయ విదారకంగా రోధిస్తున్నారు.


అంతా చూస్తున్న రత్తి గుండెలు మండుతున్నాయి. హృదయం ద్రవిస్తున్నది. యిల్లిల్లూ తిరుగుతూ అందర్నీ పరామర్శిస్తున్నది. ఊరడింపు మాటలతో వారిలో ఆశను చిగురింపచేస్తున్నది. భవిష్యత్తు పై నమ్మకాన్ని కలిగిస్తున్నది.

అయినా ఆమెలో మాత్రం నైరాశ్యం పెరుగుతూనే వున్నది. సమస్యకు సరియైన పరిష్కారం కోసం దినరాత్రులూ ఆలోచిస్తూనే వున్నది. ఆ ఆలోచన అంతులేని పరిశోధనగా మారింది. అందులోంచీ ఆ విర్భవించిన అన్వేషణ ప్రకృతి ధర్మానికీ, ప్రభుత్వ చట్టానికీ మధ్యనున్న అగాధంలోకి సూటిగా దూసుక పోతూంది.

కిమ్మత్తుకు ఎరువు దిబ్బ కొన్న గంగాధరం

పనకలు తక్కువ దిగిందని పేచీపెట్టటమే తప్పు. అసెక తనకు న్యాయంగా రావాల్సిన పైకం కోసం అతన్ని నిలదీసిన నారిగాన్ని చిత్రహింస పెట్టటం మహాపరాధమే.

ఇంత జరిగాక — నారిగాడు అతని చేతుల్లో హతుడయ్యాడన్న భ్రమలో మాలవాడ ప్రజలు పెట్రేగిపోయి విధ్వంస కాండకు ఆయత్తమయ్యారు. దెబ్బతిన్న ప్రాణి ప్రతీకారంతో బుసకొట్టటం ప్రకృతి సహజం. ఆవేశం ముంచక వ



చ్చినప్పుడు ఆలోచన అణగారటం కూడా సర్వసాధారణమే.

తర తమ భేధాలకు అతీతమైన సాంఘిక న్యాయాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వం కేవలం మాలవాడ మీదనే కక్ష కట్టి పగ సాధించటం అధర్మంకాదా?

హీనులకూ, దీనులకూ, తలఎత్తుకు తిరిగే అధికారం లేదా?? ఆత్మ గౌరవాన్ని కాపాడు కోవటం అసాధ్యమేనా??? భగవాన్ మమ్మెలెందుకు మనుష్యులుగా పుట్టించావు???

లెక్కకు మించినన్ని ఆలోచనలు ఆమె మనస్సును తొలి చేస్తున్నాయి. అచేతనురాలై పాకముందు కూర్చున్నది. ప్రశ్నలతో పరితప్తమైన మనస్సును అదుపులో వుంచుకొనే ప్రయత్నంలో నిశీధిలోకి చూస్తూ నక్షత్ర మండలాన్ని అవలోకించ సాగింది.

* * *

మరికొన్ని రోజులు గడిచి పొయ్యాయి. ముద్దాయి లెవ్వరూ అరెస్టు కాలేదు. మాలవాడ హృదయ విదారకంగా మారిపోయింది.

జిల్లా పోలీసు ఆఫీసులో 'క్రైమ్ మీటింగ్' జరిగింది. అందులో రామాపురం విషయం చర్చకు వచ్చింది. ఇంతకాలంగా ముద్దాయి లెవ్వరినీ అరెస్టు చేయనందుకు పోలీస్ సూపరెండెంట్ ఇన్స్పెక్టర్‌ను గట్టిగా మందలించాడు. డిప్యూటీ పోలీస్ సూపరెండెంట్ ప్రభంజన కుమార్‌ను పిలిపించాడు. రామాపురం వెళ్ళి పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించ మన్నాడు. వెంటనే అందరనూ అరెస్టు చేసి అరాచకాన్ని అరికట్ట వలసిందిగా ఆదేశించాడు.

ఎస్.పి. ఆదేశాన్ని శిరసావహించాడు డి.యస్.పి. ప్రభంజన కుమార్

ఇండియన్ పోలీస్ సర్వీస్ లోకి డైరక్టుగా రిక్రూట్ చేయబడ్డ ప్రభంజన కుమార్ వుత్సాహవంతుడూ, నిజాయతీ పరుడు కూడా.

ముందుకు సాగుతూన్న జీపులోంచీ వెనక్కు పరుగిడుతూన్న ప్రకృతిని తిలకిస్తూ అదో అపూర్వ రసమయ లోకంలో విహరిస్తున్నాడు. రేడియేటర్‌లో నీరు పోసేందుకు జీపును ఒక చెరువుగట్టున ఆపేశాడు డ్రైవర్

పచ్చని చిక్కటి నీటిపై అల్లన మెల్లన సాగిపొయ్యే మలయ పవనం చిరుతరంగాలతో సయ్యాటలాడుతూంటే పరవశంతో గట్టు మీద అడుగుపెట్టాడు ప్రభంజన కుమార్. కాకీ హాండ్‌స్లీవ్‌ను పైకెగ దోపుకుంటూ, మెట్ల మీద నుంచ క్రిందకు వంగి అరచేతుల్తో నీటిని గాల్లోకి చిలకరించాడు. ఆ తుంపరలు ముఖం మీద పడుతూంటే— అనూహ్యమైన అనుభూతిని అనుభవిస్తున్న వాడిల్లా — ఎదురుగా కన్పిస్తున్న అల్లంత దూరంలో నీటిమట్టం దగ్గర కూర్చున్న గోంగ్రుడుకప్ప పొడుగాటి గాల్లో ఎగురుతూన్న కీటాకాన్ని నోట వేసుకున్నాది. చెరువులో ఈదుతూన్న నీటిపాము సర్రున మెడను చాపేసి ఆ కప్పను మింగివేసింది. ఇంతలో ఆకాశంలోంచీ రివ్వున వచ్చిన డేగ ఆ పామును తన్నుకపోయింది.

నీటిలో రేడియేటర్ నింపేసి బానెట్ మూసివేసి ఆయన చెంతగా వచ్చి సవినయంగా నిల్చున్నాడు డ్రైవర్ ఖాదర్ వలీ.

"ఆ దృశ్యాన్ని చూచావా ఖాదర్ సాహెబ్! — పురుగును తిన్న కప్పను పాము మింగి వేస్తే— అన్నిటి కన్నా పైనున్న డేగ ఆపామునే కబళించింది. ప్రాణి మనుగడకు కావలసింది కండబలమేనా ఒక జీవికి మరో అల్పజీవి ఆహారం కావటం సృష్టి వైచిత్రం కాదా?? ఇదేనా ప్రకృతి ధర్మం???"

"బాస్ — పులి తన ఆకలి తీర్చుకునేందుకు లేడి నెత్తురు ఆస్వాదించటం ప్రకృతి ధర్మమైనా — ఆ అడుగులను పసికట్టి దానికి అందకుండా తప్పించుకునే నైపుణ్యాన్ని కూడా లేడికి ప్రకృతి ప్రసాదించింది. వాటి జీవితాలు అలా ముడిపడటానికి శరీర నిర్మాణంలోని తారతమ్యాలే కారణం. కప్ప నుంచీ దూరంగా వెళ్ళేందుకు గాల్లో ఎగిరే శక్తి

కీటకానికి వున్నది. కలుగులో దాక్కునే అవకాశం పాముకుండటం వల్ల అది డేగబారి నుంచి తనను తాను కాపాడుకోగలదు. కానీ శారీరక నిర్మాణంలోని తారతమ్యాలేవీ లేకపోయినా మనిషి సాటి మనిషిని దోచుకోవటం అన్నిటికన్నా విచిత్రం కాదంటారా! — ఆకలి తీర్చుకోవటానికి కాదు. ఆధిపత్యం నిలుపుకోవటానికి మాత్రమే మనిషి సాటి మనిషిని కబళిస్తున్నాడు. ఎదిగిన వాడు ఎదగని జీవితాలను పణంగా పెట్టి మరింత ఎదగడానికి ప్రయత్నిస్తున్నాడు''

''నీవన్నది ఒకనాటి మాట మనిషి సాటి మనిషి నుంచి రక్షణ పొందేందుకు ప్రకృతి సిద్ధమైన అవకాశం మృగ్యమైనందు వల్లే చట్టం ఆవిర్భవించింది. ఈనాడు సమాజంలోని ప్రతి వ్యక్తికీ చట్టబద్ధమైన రక్షణ పొందే అవకాశమున్నది''.

''చట్టం మైనం ముద్దలాంటిది బాస్. అన్నీ వున్నవాడు దాన్ని తనకు అనుకూలంగా మలచుకుంటున్నాడు''.

''నీ ఫిలాసఫీలో ఎదో లోపమున్నది ఖాదర్ దాన్ని సవరించుకోవాలి''

''లేదు బాస్ ఎన్నో ఠక్కా మొక్కీలు తిన్న తర్వాత స్వానుభవంతో నేనీ మాటలు చెబుతున్నాను. మీదనున్న వాడెప్పుడూ క్రింద నున్న వాడిపై రాళ్ళు విసరుతుండటం పరిపాటి. చట్టం వున్నా కూడా మీదనున్న వాడి చేతుల్లో కానీ క్రింద నున్న వాడి గుండెల్లో కాదు. అందుకే అదెప్పుడూ బాధ్యతను గుర్తు చేస్తుంటుందే తప్ప హక్కులను రక్షించలేదు. కొండలు పెరుగుతుంటే లోయలు పాతాళానికి కూరుక పోతుంటాయి. ఆ పెరుగు దలకు పరిమితి వున్నప్పుడే లోయలు కూడా ఉబకటానికి ఆస్కారముంది. అలా జరిగితే మనుష్యులంతా ఒకే ఒక సమతలం మీదకు రాగలరు. ఆర్థిక సమానత్వం సిద్ధించినప్పుడే మనిషి నుంచీ సాటి మనిషికి రక్షణ ఏర్పడగలదు. యుగాల తరబడీ బలహీన వర్గం బలవంతుల చేతుల్లో నలిగిపోయింది. ప్రతిఘటన చేయాలన్న తలంపే వారిలో ఉదయించలేదు. ఇప్పుడిప్పుడే పీడిత జాతి జాగ్రదావస్థలోకి వస్తున్నది. తాము బలపడితే తప్ప ఎదుటి వారిని ఎదుర్కోలేమన్న సామాజిక స్పృహ వారిలో పొడసూపుతున్నది. వ్యక్తిగా సాధించలేనిది సంఘటిత శక్తిగా సాధించవచ్చునన్న అభిప్రాయం బలపడుతున్నది. దుర్బలత్వాన్ని తిట్టుకోవటంకాదు ప్రయత్నంతో ముందుకు సాగటమే నేటి కర్తవ్యం. తలమీద పడుతున్న యినుప పాదం క్రింద ఊరికే ఒదిగి పోవటం కాదు. రెండు చేతులూ పైకెత్తి దానిని వెనక్కు త్రోసి వేయటమే నవచైతన్యం. చట్టం ఈ మహా యజ్ఞానికి అవరోధం కాకుంటే చాలు''.

''భలే ఖాదర్ సాహెబ్ నువ్వెంత లోతైన మనిషివి!! వెళ్ళి జీపు స్టార్టు చెయ్''.

* * *

డి.యస్.పి. ప్రభంజన కుమార్ వూళ్ళోకి వచ్చాడన్న వార్తతో రామాపురమంతా అట్టుడికి పోయింది. చెల్లా చెదురుగా విడిపోయి అల్లి బిల్లి ఆటలలో నిమగ్నమయి వున్న రిజర్వుడు పోలీసు దళమంతా ఆయన రాకతో ఒక్కసారిగా జాగ్రదావస్థలోకి వచ్చింది.

వచ్చీరాగానే గ్రామ చావిడిలోకి వెళ్ళి అక్కడున్న లోకల్ హెడ్ కానిస్టేబుల్ని గట్టిగా మందలించాడాయన. మూకుమ్మడిగా తనను చూడవచ్చిన రిజర్వు పోలీసులను చీవాట్లు వేశాడు. ఇన్ని రోజులైనా నిందితులను అరెస్టు చేయలేని వారి



**లేటు**

''రోజూ ఆఫీసుకి లేటుగా రావడం ఏం బాలేదమ్మాయ్. నిన్న మీ ఆయనతో దెబ్బలాడి నందుకు ఆలస్యమయిందన్నావ్.. ఈరోజు ఏవొచ్చిందటా!'' చిరాకు పడ్డాడు ఆఫీసరు లేటుగా వచ్చిన సరళపై.

''ఆయన్ని హాస్పటల్‌లో చేర్పించి వస్తున్నా సార్'' తాపీగా చెప్పింది సరళ

—డి.సీతాదేవి (తెనాలి)

అసమర్థతను దుమ్మెత్తి పోశాడు.

ఈలోగా ప్రెసిడెంటు పుల్లంరాజు, మునసబు ముకుందరావు కూడా అక్కడకు వచ్చేశారు. ఇన్స్పెక్టర్‌కు చెప్పినట్లే ఆయనకు కూడా మాలల ఆగడాలను గూర్చి లేని పోనివి కల్పించి చెప్పారు. కేసు ఫైలును క్షుణ్ణంగా చదివేసిన ప్రభంజన కుమార్ అందులోని వివరాలను మననం చేసుకుంటూ వారి మాటలను వాటితో అన్వయించుకుంటూ మరికొంత అవగాహనకు ప్రయత్నించాడు.

పోలీసుల పెరపు దాడి సందర్భంగా ముద్దాయిల యిళ్ళలో దొరికిన నాటు బాంబుల విషయం చర్చకు వచ్చేటప్పటికి, ఆయన ప్రళయ కాల రుద్రుడే అయ్యాడు. అమాంతంగా పైకి లేచి నిల్చొని బెల్టుకు తగిలించుకున్న రివాల్వర్ లెదర్ కేసు మీద చేయివేశాడు. ఆవేశంతో నిలువెల్లా కంపించి పోతుండగా సిబ్బంది వైపు తీక్షణంగా చూస్తూ, నిందితుల కోసం చెట్టూ పుట్టా గాలించమన్నాడు. చుట్టు ప్రక్కల వూళ్ళన్నిటి మీద మెరుపు దాడులు జరపమన్నాడు. పాతాళాన దాక్కున్నా సరే నిందితుల నందరనూ వెంటనే అరెస్టు చేయవలసిందిగా ఆదేశించాడు.

ఆయన ఆవేశం చూచి చూపరులంతా నిశ్చేష్టులయ్యారు. పోలీసు దళాలు అప్రమత్తతతో వ్యవహరించటానికి ఆయుత్తమయ్యాయి. క్షణకాలం అలా నిల్చున్న అనంతరం ఆయన కూడా గబగబా మెట్లు దిగేసి వారితో కలసి ముందుకు సాగిపోయ్యాడు.

* * *

మాలవాడలో పరిస్థితి మరింత దయనీయంగా తయారయింది. వైద్య సదుపాయమెలాగూ లేదు వేళకింత తిండికూడా దొరకని స్థితిలో యిద్దరు ముసలి వాళ్ళు ఆకలి మంటలకు ఆహుతయ్యారు.

కడుపు నిండని పసిపిల్లలు తల్లుల పమిటలు లాగివేస్తున్నారు. రవికెలు చింపి వేస్తున్నారు. పాలు లేని రొమ్ములు చివికి చివికి అలసిపోతున్నారు. వీరసంతో నిర్లిప్తంగా కూచున్న ఆడవాళ్ళు ఆ పిల్లల్ని జోకొడుతున్నారు. తమకు జన్మనిచ్చిన భగవంతుడిని తిట్టిపోస్తున్నారు.

గోరుచుట్టుపై రోకటి పోటన్నట్లు మరో వైపు నుంచి మశూచి వ్యాధి మహాంకాళిలా విజృంభించింది. వ్యాధి సోకిన పిల్లలకు వేప పసరు తప్ప మరో మందు అందుబాటులో లేదు. పెసర పొంగలి ఈత పీరా పాదలైనవి లభ్యం కావటం లేదు. విషయము తెలియని హెల్త్ డిపార్టుమెంటు వారు టీకాలు వేయటానికి రాలేదు. వస్తారనే ఆశ కూడా లేదు.

పన్నెండేళ్ళ కుర్రాడొకడు ధనుర్వాతంతో బాధ పడుతూ అవసాన దశలో వున్నాడు. వాడి తల్లి హృదయ విదారకంగా రోధిస్తున్నది. చుట్టుప్రక్కల అమ్మలక్కలు అక్కడ గుమికూడి ఆమెను ఓదార్చటానికి ప్రయత్నిస్తునారు. రత్తమ్మ ఆ కుర్రాడికి నిర్విరామంగా సేవ చేస్తున్నది. నుదుటి మీద తడిగుడ్డ వేసి ఎడమ చేత్తో చాల్ని గట్టిగా పట్టుకున్నది. కుడి చేత్తో వాడి గొంతులోకి పసరు పిండుతున్నది.

ఏమి చేసినా ఆ పిల్లాడిని దక్కించు కోవటం సాధ్యం కాదని ఆమెకు బాగా తెలుసు. మునుపొక సారి పదేళ్ళ పిల్లాడికి యిలాంటి జబ్బే వచ్చింది. సరిగా సమయానికి గూడెంలోకి వచ్చిన మలేరియా వర్కర్ రోగిని పరీక్షించి వెంటనే పట్నం ఆసుపత్రికి తీసుకెళ్ళమన్నాడు. ఆయన సలహామేరకు ఆసుపత్రికి పోతే అదేదో సూది మందు మంచులో మంచి బయటకు తీసి పిల్లాడికి ఎక్కించారు. కోలు కోవటానికి చాలా రోజులే పట్టినా ప్రాణాలతో బయట పడ్డాడు. అప్పుడు డాక్టర్లు చెప్పగా విన్నది. ఈ జబ్బుకు ఆ సూది మందు తప్ప మరేదీ పని చెయ్యదట. పట్నం తీసుకు పోదామంటే గూడెంలో ఒక పాకలో కూడా తిండి గింజలు లేవు. ఇక బస్సు చార్జీలకూ, డాక్టర్ ఫీజులకూ డబ్బెక్కడ నుంచి తీసుకు రాగలదు. నడచి పోదామంటే దగ్గర దాపు కాదు. కనీసం ముప్పయి మైళ్ళ దూరముంటుంది.

పసరు పిండేసి అలాగే ఆలోచిస్తూ కూర్చున్నదామె. ఇంతలో పిల్లవాడి కండ్ల మీద నీలం రంగుతేలింది. బిగుసుకు పోయిన కాళ్ళూ చేతులూ తీవ్రంగా కంపించసాగాయి. ఇక ఆ

పిల్లాడు అట్టేసేపు బ్రతకడని ఆమెకు అర్థమయింది. జీవన్మరణ పోరాటంలో క్రమేపీ మృత్యువుదే పై చేయి అవుతున్నది.

అలాంటి దశలో కూడా వాడేదో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడు. తలపైకెత్తి అస్పష్టంగా గొణుక్కుంటున్నాడు. రత్తి తన ముఖాన్ని వాడి చేరువగా తీసుకెళ్ళి ఆ మాటలు వినాలని ప్రయత్నించింది. అంతలోనే వాడి తల వెనక్కు వాలి పోయింది. శరీరంలో చలనం స్తంభించింది. పంచ ప్రాణాలూ అనంత వాయువుల్లో కలసి పొయ్యాయి.

రత్తి మనస్సు పూర్తిగా వికలమయి పోయింది. కాళ్ళ దగ్గర పడున్న దుప్పటి తీసి శవాన్ని కప్పి వేసింది. తల్లి కొడుకు కళేబరం మీద పడి పెద్దగా ఏడ్వ సాగింది. వాతావరణం స్తంభించింది. శోకం వెల్లువలా ఎల్లెడలా తానై చదించ సాగింది.

చనిపొయ్యేముందు పిల్ల వాడి మాటలు స్పష్టంగా విన్పించలేదు. కానీ వాడి తండ్రి కోసమే కలవరించాడని మాత్రం రత్తికి బాగా తెలుసు. వాడి తండ్రి కూడా పరారీలో వున్నాడు. కొడుకు చావు బ్రతుకుల్లో వున్నాడని కూడా వాడికి వార్త వెళ్ళలేదు. చితికి నిప్పు పెట్టాల్సింది కూడా వాడే. మరిప్పుడేం చెయ్యాలం ఆమెకు అర్థం కావటం లేదు. గాఠంగా నిట్టూరుస్తూ అక్కడి నుంచి ముందుకు కదిలింది.


సరిగ్గా అప్పుడే పోలీసులు గూడెంలో ప్రవేశించారు. బూట్ల టకటకల తోనూ లాఠీల టపటపలతోనూ పరిసరాలు హోరెత్తి పోతున్నాయి. ఇళ్ళలోకి దూరి సోదాలు జరుపుతున్నారు. కనిపించిన ప్రతి ఒక్కరినీ నిలదీసి ప్రశ్నిస్తున్నారు. నిందితుల ఆచూకీ చూపకపోతే పాకలన్నీ నేలమట్టం చేస్తామని బెదిరిస్తున్నారు. పోలీసు భాషలో వారి గొంతులు పేట్రేగి పోతున్నాయి. చూస్తుండగానే వాతావరణం మరో మలుపు తిరిగింది.

ఆడవాళ్ళు నీరుగారి పోతున్నారు. కన్నీటితో పోలీసు పాదాలు అభిషేకిస్తున్నారు. బిక్కచచ్చిన గుండెలతో రత్తి చుట్టూ మూగుతున్నారు. ఆమెను పొదవి పట్టుకుని విలపిస్తున్నారు.

స్తంభించిన హృదయంతో మౌనంగా నిల్చున్నది రత్తి. జరిగిన దంతా ఆమె స్మృతి పథంలో మెదలుతున్నది. జరుగుతున్న విషయాలు సమిధల్లా కాలుతున్నాయి. మనస్సు పొయ్యి మీద పెనంలా మారింది. సహనం కోల్పోయింది గుండెను బండ చేసుకున్నది. గుంపును చీల్చుకుని బయటకు వచ్చింది. పరుగులాంటి నడకతో పోలీసుల ముందుకు వెళ్ళింది.

"ఆగండయ్యా! ఆగండి గుడ్డ లేనున్న మగాళ్ళు కదయ్యా. ఆడాళ్ళ మీదెందుకయ్యా. మీ ప్రతాపం ముద్దాయిల్ని చూపిత్తాను. అరెస్టు చేసుకోండి. కటకటాల ఎనకాల తోసెయ్యండి. అధికార ముండాదిగదాని ఆడతనం తోనూ,

ఓటు వేయం.




ఆ మధ్య బేటియా నియోజకవర్గంలో లోక్‌సభకు ఉపఎన్నిక జరిగింది. అయితే ఆ నియోజకవర్గానికి చెందిన ఆరు గ్రామాల ప్రజలు ఎన్నికల లో పాల్గొనలేదట? ఎన్నిక అయిన ప్రతినిధులు మళ్ళీ ఎన్నికలదాకా.. ప్రజలకు ముఖం చూపించటం లేదని ఆలోచనతో ఆ గ్రామాల ప్రజలు ఎన్నికల్ని బహిష్కరించారట? ఒక గడుగ్గాయి అయితే ఓటు వేయాల్సిన కాగితంమీద "అందరూ దొంగలె" అనిరాసి రాజకీయ నాయకులమీద వున్న కసిని 'ఓటు ముఖంగా' వెల్లడించుకున్నాడు. అయినా మనని ఎవరు పట్టించుకొంటారండీ! ఎవరికయినా...ప్రజా ప్రతినిధులుగా వచ్చే సుఖాన్ని అనుభవిద్దామని ఉంటుంది తప్ప...తమని ఎన్నుకున్న ప్రజలకష్టాలు పరిష్కరిద్దామనే ఆలోచనరాదు. ఏమయినా ఇప్పుడు రాజకీయాలు కూడా ఓ వృత్తిగా అయిపోయాయి.

జూపిటర్.

బేలతనంతోనూ ఆడుకుంటారెందుకయ్యా!?'' ఆడపులిలా పోలీసుల మీద విరుచుక పడిందామె.

అల్లంత దూరంలో వేప చెట్టు క్రింద నిల్చుని రివాల్వర్ బారెల్ సరిచేసుకుంటున్న డి.యస్.పి ప్రభంజన కుమార్ వులిక్కి పడి అటువైపు తిరిగాడు. చింపిరి తలతో చిరుగులు పడ్డ చీరెలో బక్క పలుచగా వున్న స్త్రీ మూర్తి పోలీసుల్ని దబాయిస్తున్నది. వేగిరమే ఆమె చెంతకు చేరుకున్నాడు. నమ్మలేనట్లు కళ్ళు నులుముకుంటూ ఆమెను పరికించి చూశాడు.

''ఏయ్ పిల్లా! — ఏమిటలా దబాయిస్తున్నావు? అంత రోషమున్న దానివైతే ముద్దాయిల్ని ఎప్పుడో పోలీసుల కప్పగించాల్సింది''

''ఛీ ఊరుకోవయ్యా. రోషముంటే మా మగాళ్ళను మీ కప్పగిత్తామటయ్యా? — రోషం చచ్చిందాది కాబట్టే యిప్పటికైనా మీకు లొంగి పోతుండాము''.

''నోరు ముయ్యవే ముండా. నీ ముందర నిల్చున్నది డి.యస్.పి. దొరగారు. అధిక ప్రసంగం చేశావంటే వీపు చిట్లి పోతుంది జాగ్రత్త:'' లాఠీ ఝులిపిస్తూ ముందుకు వచ్చాడు హెడ్ కానిస్టేబుల్ వీర్రాజు.

''ఆగు వీర్రాజూ ఆమెతో నేను మాట్లాడతాను!'' ఆశ్చర్యం నుంచీ తేరుకుంటూ ప్రక్కకు తప్పుకోవల్సిందిగా సిబ్బందికి సైగ చేశాడు ప్రభంజన కుమార్.

''తప్పు చేశాక చట్టానికి తలవంచక తప్పదమ్మ. ఇక్కడ రోషాలకీ ద్వేషాలకీ తావులేదు. చట్టం ముందర అందరూ సమానమే.''

''మేము తప్పు చేసిందామని ఎవరయ్యా కుసింటారు. ఒళ్ళు కరగ దీసు చమటను సొమ్ము చేసుకుని బ్రతుకు తుండాము. రెక్కాడితేగాని డొక్కాడని మా కూలి జనాన్ని అట్ట కట్టాల పాలు చేసిన తప్పుడోళ్ళంతా మిద్దెల్లో గులుకుతుంటారు. ఆరి నేమి జేసిండారయ్యా! మీరు?''

''నేరం చేస్తే వారిని కూడా వదిలి పెట్టం. ఎవ రినైనా శిక్షించే అధికారం మా కుంది.''

''అగ్గదీ! అధికారముండాది గదాని అమాయకుల నెత్తిమీద కాలు మోపు తుండారే తప్పు అసలు నేరత్తు లెవరో పసిగద్తుండారా? తెలిసినా తెలియనట్లే కండ్లు మూసుకుని దోవ మళ్ళుతుంటారు.''

''అసలు నీ ఉద్దేశం ఏమిటమ్మా? డకాయిటీ చేస్తే కూడా మిమ్మల్ని వదిలి పెట్టాలా??— ప్రభుత్వం మీకు రాయితీలు ప్రకటించింది ఎదుటి వాడి దౌర్జన్యం నుంచీ మిమ్మల్ని కాపాడి మీ అంతస్తు పెంచాలని గానీ, మీరు నేరాలు చెయ్యాలని గాదు.''

''ఆ— రాయితీలా! రచ్చబండలా?! కాగితాల మీద మరకలు గురించి కాదయ్యా మడిసి మనస్సు గురించి చెబుతుండా. నేయంగా తనకు రావాల్సిన ఎఱువు దుడ్ల కోసం గంగాధరం తోట కాడికి పోయిన నారిగాన్ని చెట్టుకు కట్టేసి చితక బాదితే తప్పకాదు. ఆడుచచ్చిండాడన్న బెమతో మా జనాలు గంగాధరం తోట మీద యిరుసుక పడటమే తప్పు కదయ్యా? మీరే కాదు మేము కూడా సీమూ నెత్తురున్న మనుసులమేనయ్యా. నువ్వూ మాలోవాడివైతే రోసం రాక పోతుందటయ్యా? మరి ఎక్కడుందయ్యా రాయతీ?— సదువూ సందెల్లేనోళ్ళం. మా కండ్లంటే ముసుకపోయిందాయి. నువు జూపించవ య్యా రాయితీని''

''నువు చెబుతున్నది నిజమా?! —మీ మనిషిని గంగాధరం చితక కొట్టాడా??!!''—

''చితక కొట్టాడా!— పికి పోగులెట్టిండాడు. శవాన్ని జేసిండాడు గదయ్యా. వాడు తిరుగుతుంటే మరో జనమవ్ ఎత్తాడనుకున్నావ్''

''ఆ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకరాకుండా మీరే స్వయంగా ప్రతీకారం తీర్చుకోవటం తప్పమ్మా. వెంటనే పోలీసు రిపోర్టు యిచ్చివుంటే చట్టం రక్షణ కల్పించేది''

''సట్టం!! ఏందయ్యా సట్టం!! ఎవరేది చెబితే దాన్ని యినడమే గాని యిసయం తెలుసుకో గలుగుద్దా మీ సట్టం. పోనీ పోలీసోళ్ళ కాడకీ చెప్పుకుందామంటే మాలాటోళ్ళ నెవరయ్యా లెక్క జేత్తారు. కండ్ల కద్దాలు బెట్టుకొని తోలు సంచీ

వూపుకుంటూ ఓ వన్నె చిన్నెల టక్కులాడి స్టేషన్‌లో అడుగెడితే యినస్పెకటర్ బాబుకూడా చివాలు పైకి లేచి మేడమ్మా కూరుసోమ్మా అంటాడుగానీ అతుకు లేసిన బొంత కోకతో నేనాడకు పోతే ఎర్రటోపీ జవాను కూడా యిసడించి బయటకు గంటేత్తాడయ్యా. పాపం చెట్టం అదెప్పుడూ మీలాంటి గొప్పోళ్ళ జేబుల్లో దాచి పెట్టుకుంటాది గానీ, మాలాటి పేదోళ్ళ కాడికి రమ్మన్నా రాదు. అందునా అదో పెద్ద మైనం ముద్దాయె. పెద్దోళ్ళు దాంతో సందినీ చెయ్యగలరు. పందినీ చెయ్యగలరు.''

•''ఒక కోణం లోంచే నువ్వు సమాజాన్ని దర్శిస్తున్నా వయ్యామ్మ. కామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కన్పిస్తుంది.''

''చట్ నువ్వూరు కోవయ్యా! —మా కండ్ల తుడవడానికి ఫిర్యాదు నందుకున్నా— ఆనెక గంగాధరం దుడ్లకడ ఆళ్ళు తలోంచేస పోతారా— నేయం నట్టేట కలవక పోతుందా?—''

''ఏమ్మా జాగర్తగా మాట్లాడు అవకాశం యిచ్చానుకదాని యిష్టం వచ్చినట్లు వాగెయ్యకు. ఎవరో ఒకరిద్దరున్నారని అందరనూ లంచగొండులుగా చిత్రించ వద్దు. నా సర్వీసులో విధి నిర్వహణ పరంగా నేనెప్పుడూ తప్పటడుగు వెయ్యలేదు. నేను డబ్బు మనిషిని కాదు.''

''నేను దుడ్ల కమ్ముడోనంటే నమ్మడానికి నేనేం తిక్కదాన్నటయ్యా!? ఓరయ్యా దుడ్ల కమ్మతోంది?— ఇచ్చేవాడుంటే సచ్చేవాడు కూడా లేసోత్తాడే. దుడ్లుంటే చట్టమే మారి పోద్దిగదయ్యో!— అసలు నువ్వొకడివే దొరమ ప్రభువుంటే మిగతావారి మాటేంటి. నీ బాబు లాంటి దొరను కూడా ఆళ్ళు దుడ్డెట్టి కొనగలరు.''


''నీకు మతిసరిగా లేదు మాటల్ని పెంచక నేరస్థుల్ని మర్యాదగా నాముందుంచు.''

''ఓ యబ్బ!— కోపమొచ్చిండాది దొరగారికి. నిజమాడితే నిట్టూరమే గదా. అయినా నీతో నాకు వాదనేంటి? అరిసే వాడివా తీరిసే వాడివా?? నీకు గావాల్సింది ముద్దాయిలు. ఉండిక్కడే చనాల్లో తీసుకొత్తా.'' అంచేతులు రెండు గుప్పెళ్ళుగా మార్చి చంపల కేసి వేళ్ళు విరచుకుంటూ చక చకా గూడెంలోంచీ బయటకు వెళ్ళిందామె.

డి.యస్.పి కనుసైగ ననుసరించి సాదాదుస్తుల్లో వున్న ఒక కాన్‌స్టేబుల్ రహస్యంగా ఆమెను అనుసరించాడు.

* * *

రత్తి వెళ్ళి పొయ్యాక గూడెమంతా తిరిగి అక్కడి పరిస్థితిని కళ్ళారా చూశాడు ప్రభంజన



కుమార్. విలయ తాండవం చేస్తున్న మశూచి వ్యాధి — ఆకలితో దహించుక పోతున్న పసిపిల్లలూ — అవసాన దశలో తండ్రి కోసం అలమటించి అసువులు బాసిన పిల్లవాడి శరీరమూ— అన్నింటినీ చూసేటప్పటికి ఆయన హృదయం ద్రవించుక పోయింది.

కొందరు ఆడవాళ్ళను చెంతకు పిలిచి అనునయంగా మాట్లాడుతూ వారినీవరించి వున్న భయాన్ని తొలగించాలని ప్రయత్నించాడు. జరిగిన విషయాలను యధాతథంగా వివరించ వలసిందిగా అభ్యర్థించాడు.

ఇంతలో వందమందికి పైగా మగవాళ్ళను వెంటబెట్టుకొని గూడెంలోకి ప్రవేశించింది రత్తి. వెనుక నడిచి వస్తున్న వారి ముఖల్లో కత్తి వాటుకు కూడా నెత్తురు చుక్కలేదు. అవనత శిరస్కులై ఆమెను అనుసరించి వస్తున్నారు.

నులక మంచం మీద కూర్చుని ఆడవాళ్ళతో ముచ్చటిస్తున్న ప్రభంజన కుమార్ ఆ దృశ్యాన్ని చూస్తూనే అమాంతం పైకి లేచి నిల్చున్నాడు.

"వ్వాట్?! —నెలరోజుల్నుంచీ యింతమంది పరారీలో వున్నారన్నమాట. నిందితులు ముప్పయి మందే కదా." ఆశ్చర్యంతో సందేహం వ్యక్తం చేశాడు.

"కేసులో ఎంత మందుండారో మాకెట్టా తెలుస్తాదయ్యా. ఆనాడు కేసెట్టిన్నాడు— పోలీసోళ్ళ కంటే ఆళ్ళే ముందొచ్చి గూడేవ్వంతా పట్టుక పోతారని పుకారు జేసింద్రు."— దూకుడుగా జవాబిచ్చింది రత్తి.

"అల్లాగా జరిగిందేతో జరిగింది. ముద్దాయిల పేర్లు చదువుతాను. వాళ్ళు మాత్రం ప్రక్కకు వచ్చి వేరుగా నిల్చోండి" అంటూ ఎస్.ఐ. ఈ సాంతమూ చదివేశాడు.

"ఏందయ్యా కేసునిండా కల్లలే కొల్ల బొయిండాయి. మా వాళ్ళు బాంబులతో దాడిజేసిందారా?! ఈ రాంజనేయులు బుర్ర పగల గొట్టిందారా!!??— అంతా కయిత్తమే గదయ్యా!!" రత్తి గుండెలు మండి పోయ్యాయి. ఆడపులిలా బుసగొడ్తూ రెండడుగులు ముందుకు వేసింది.

"అసలేం జరిగిందో నాకు తెలియదమ్మ. ముద్దాయిల యిళ్ళలో నాటు బాంబులతో సహా తగిన సాక్ష్యాధారాలు లభించాయి. దాంతో కేసు బలపడింది."— రత్తి ఆవేశం చూసి ఆశ్చర్యంతో ప్రశాంతంగా జవాబిచ్చాడు.

"మా పాకల్లో బాంబు లెక్కడుండాయి. అసలు ఆటితో మాకు పనేముండాది. గూడెమంతా పరారీలో వుండగా— ఆల్లే ఆటిని మా పాకల్లో పడేసుంటారు."

"ఊహలూ అంచనాలూ చట్టానికి పనికి రావమ్మ. దానికి కావాల్సింది ప్రత్యక్ష సాక్ష్యాధారాలు. బాంబులతో పాటూ గంగాధరం తాలూకు వస్తు సముదాయం కూడా మీ పాకల్లో దొరికినది. అందునా వీరాంజనేయులు బుర్ర పగలగొట్టారు గదా అతని గాయాన్ని ఇన్స్పెక్టర్ స్వయంగా చూసి కేసులో నమోదు చేశాడు. తుటిలో ప్రమాదం తప్పిన హత్యా ప్రయత్నమని మెడికల్ ఆఫీసర్ సర్టిఫై చేశాడు. డాక్టర్ వ్రాత వీరాంజనేయులు ప్రత్యక్ష సాక్ష్యాన్ని గట్టిగా బలపరుస్తున్నది.—

"సట్టం.. సట్టం.. ఏందయ్యా సట్టం. ఎక్కడున్నాదయ్యా సట్టం. దాని నివాసమెప్పుడూ గొప్పోళ్ళ జేబుల్లోనే గదయ్యా. మీ లాటోళ్ళ చేతుల రాతల్లోనే గదయ్యా దాని ఆకారం మాటి మాటికీ దాని వూసు మా కెందుకయ్యా. పాపం అదేమో నిప్పులాటిదే. మనసుంటే దాన్ని పొయ్యిలో రాజేసి వంటలు వండేసి పాలు మరిసి కడుపు నింపటానికి వీలేద్ది. గుండెలు బండలైనప్పుడు ఎదుటోళ్ళ కొంపల మీద పడేసి ఆటిని కాల్చటానికి కూడా పనికొస్తుంది.

"క్రిందటేడు మా పక్కూళ్ళో ఓ ఖూనీ జరిగి పోనాది. రాముడనే ఓన్ని ఓరో సంపేసింద్రు. ఆడి తాలూకు జనం జెప్తే పోలీసోళ్ళు రంగడి మీద కేసు పెట్టింద్రు. తగిన సాచ్చాదారాలు లేవని కోర్టోళ్ళు ఆ కేసు కొట్టేసింద్రు. రాముడు సంపబడింది సత్తెమని సట్టం ఒప్పుకుండాది గదా. రంగడు గాక పోతే మరో ఎంకడో, పుల్లడో, తిప్పడో ఓరో ఒకరు ఆడ్ని సంపండాలగదా.వాడు ఓర్రైందీ

**తెలుసుకొడాని పూసుకుందా మీ సట్టం? ఓ హత్తే జరిగి పోనాక పెట్టిన కేసు యిగి పోతే— అంతలో ఊరకయ్యే సట్టం— జన్నాల్ని రచ్చించగలదా— మాలాటోళ్ళకు అండగా నిలబడగలదా.**

దేవలాల్లోకి అందరనూ బొనియ్యాలని ఎప్పడో సట్టం జేసిండా రంట. మరి ఈయాల మా వూరి దేవలంలోకి మేమెల్లగల మటయ్యా. పోలీసోళ్ళొచ్చి ఆడ నిలబడి మమ్మల్ని లోనికి నెట్టినా ఆళ్ళు పోనాక మా పీకలు నులిమేత్తారు. ఈనాటికీ ఊర బావుల్లో నీళ్ళు చేదుకునే అరహత మాకు రాదాయే. నిజంలోకి రానపుడు కాగితం మీదున్న ఆ మరకలు మాకేమి పని కొత్తాయి చెప్పండయ్యా. పెబువులుంటే పేటల్లో గాదయ్యా, మారుమూల వల్లెల్లోనే నిజం దేశముండాది.

ఇక్కడ గానీ మరెక్కడ గానీ తెలివిగలోళ్ళూ, దుడ్లున్నోళ్ళు మంచి జేసినా, చెడు జేసిన అది ఆళ్ళకి అనుకూలంగానే మారుతుండాది మాలాటోళ్ళు నిజంగా మంచి జేసినా అది చెడుగా మారిపోద్ది.

దుడ్లుంటే పగోల్ల మీద కేసెట్టుడానికి పక్కోళ్ళ బుఱ్ఱ దానంతటదే పగిలి పోద్దయ్యా. డాకటేరు జేబు నిండితే కాసింత నెత్తురు చుక్కయినా పిడిబాకు పోటవుద్ది. చావు దెబ్బగా మారి పోతది. ఆయనోరో మంతిరి గారంట. సొంతూళ్ళో ఓడి పోతే పరాయి చోట మరోగాయన తన సీటుకు రాజీనామా జేసేసి— ఈయిన గోరు ఆడ నిలబెట్టి గెలిపించి నాడంట. అధికార ముండాల లేదా దుడ్లుండాల తేగాలు జేసి ఆదుకునే వాళ్ళు కోకొల్లలు.''

''ఇంతకూ నువ్వు చెప్పేదేమిటి?— మీవాళ్ళు వీరాంజనేయులు తలమీద యినుప చువ్వతో పొదటం కట్టు కథంటావా?''

''ఇంకా మీకు సందేహంగా **వుండాదేంట** దొరా!? ఇంతా జరిగిండాది. ఇంగ జరగ **బొయ్యే**దేముండాది. మహా అయితే యి ముప్పయి మంది నేరత్తుల్ని కటకటాల ఎనకాల తోసేత్తారు. అదెల్లాగూ తప్పదని నిర్ణయించు కుందాము. మీరంతా పెద్ద మనుజులు. పెద్దోళ్ళ మనుజులు. పై నుండే బగవంతుడే దిగిరావాల. మా బతుకులు మెరుగు పడాల. ఆడి మీద అనగా సత్తెమే జెబుతుండా. మీ ములాజాకు ఆశపడి మాతరం కాదు. ఓపికుంటే మా మాటలైనా యినుకో. లేకపోతే ఎంటనే నేరత్తుల్ని దీసుకుని ఎళ్ళిపో.''

''నిజమేదైనా యిదశలో నేను మీకేమీ సహాయం చెయ్యలేను. అయిన ఎవ్వరేమి చెప్పినా సావధానంగా వినటం కూడా మా విధి నిర్వహణలో ఒక భాగమే. నువ్వు చెప్పతలచిందంతా సొంతమూ శాంతంగా చెప్పమ్మా. నింపాదిగా వినటానికి నేను సిద్ధంగా వున్నాను.''

''అసలు ఆనాడేం జరిగిందో తెలుసా దొరా. గెంగాదరం నారి గాడితో కిమ్మత్తుకు ఎలువు దిబ్బ కొనిండాడు. అది తన జాగాకు చేరి పోనాక అంచనా తప్పిందాడన్న మిసతో దిబ్బకింద నిౘరుండాదని బొంకిండు. ఆడిన బేరంలో సగానికి సగం తగ్గించి యివ్వ జూచిండాడు. ఆయాలే వరినాట్లెయ్యడానికి తలా రూపాయన్నరిత్తామని ఆడ కూలీలను తీసుక పోనాడు. తీరా పని జరిగిపోనాక ముప్పావలాతో పిరి పెట్టజూచిండు. ఆళ్ళలో నేనూ ఒగదాన్ని దొరా. మేమంతా కూడబలుక్కుని తలా రూపాయిన్నరిచ్చే దాకా కదలమని ఆనగోరి పించే బట్టుకుని నిలేసిండా ము. అప్పుడే నారిగోడు దుడ్ల కోసం ఆడి కొచ్చిండు. ఆడిగ్గాడా అన్నేయం



డూప్

''మా వాడేమో కొట్టలేదంటున్నాడు.. మీరంతా కొట్టేడంటున్నారు. నిజం చెప్పండి'' గద్దించి అడిగాడు సినీ హీరో రంగారావు పిల్లలతో.

''మీ. వాడు స్వయంగా కొట్టక పోవచ్చు.. కానీ డూప్‌ని పెట్టి కొట్టించాడుగా'' బావురు మన్నారు పిల్లలు

—డి.సీతాదేవి (తెనాలి)

జేత్తుంటే ఆడిన బేరమంతా యిచ్చేదాకా కదలొద్దని ఎచ్చరిస్తిని దొరా.

మేమిల్లకు ఎల్లి పోనాక చెంతనున్న యాప సెటుట్టుకు ఆన్ని కట్టేసి గొడ్డును బాదినట్టు బాదిండారు. కొట్టి కొట్టి అలసి పోనాక మొగం లోని యాపమండను దింపేసిండు. వళ్ళంతా నెత్తురు ముద్దయి తెలివి తప్పేకాడికి సచ్చిండాడని బెమపడి అన్నుంచీ తప్పుకుండారు.

ఆరేతిరి నడిరేతిరయినా మొగుడు రాలేదని చిట్టెమ్మ వచ్చి నన్ను లేపినాది. అనుమానమొచ్చి మందిని తీసుకుని గెంగాదరం తోట కెళ్తిమి దొరా జూస్తిమి గదా నారిగొన్ని యాప సెట్టుకు కట్టేసిండ్రు. ఆడి వళ్ళంతా రకతమే. తల వాలి పోనాది. దేహం మీద తెలివేలేదు. సచ్చిండాడన్న బెమ కలిగిండాది.

మగోల్లంతా కోపంతో పెట్రేగి పోనారు. వల్లు దెలీని పెతీకారంతో పంపు సెట్టు పగుల గొట్టిండ్రు. ఎడ్ల బండ్లు యిరగ్గొట్టిండారు. గొత్రి పొట్టేళ్ళ తలలు కోసిండ్రు. ఇంతలో నారిగోడికి తెలివొచ్చినాది. ఆడు సావలేదని తెలిసిపోనాది. అందరి కొపమూ చనాల్లో దిగిపోనాది దొరా ఎంటనే అన్ని తీసుకోని యింటి కొచ్చిండాము.

ఆదీ దొరా అసలు యిసయం. ఇదంతా జరిగినపు డు ఈరాంజనేయులు ఆడ లేనే లేదు దొరా. ఆనగోరే గాదు గెంగాదరం తాలూకు మనుజులే లేరు. ఇంతా జరిగిండాదిన తెల్లారి లేచి వూరంతా బగటయి పోనాది. అంతా జీర జాగరతగా ఆలోచన జేసి పతక మేసిండారు. పగబట్టి పతీకారంతో కాటేసిండారు.

కాయితాల్లోంచీ మీరు జరిగిన దాంట్లో ఓటీ నిజం లేదు దొరా. కల్లలన్నీ కలబొసి అతికినట్టు పేర్చిండారు. అసలు ఆన్ని రెచ్చగొట్టింది నేను గదా. ఆల్లకి బుద్దుంటే నా మీద కేసు బనాయించాల. పరి పరి మెరికల్లాంటి మొగోల్లందరనూ యిరికించిండారు.'' అంటూ గబగబా చెప్పేసి కాస్త వూపిరి పీల్చుకున్నాది రత్తి.

"నువు చెప్పేదంతా నిజమా? గంగాధరం తాలూకు వస్తువులు మీ గూడెంలో దొరకటం బూటకమేనా!— అల్లిన పథకం ప్రకారం మీ పాకల్లో బొంబులు పడవేశారా!! వీరాంజనేయులు బుర్ర పగలటం కూడా వారి కుట్రలో ఒక భాగమేనా!!!—

"ఇంకా మీ అనుమానం తీరకపోతే ఎలా దొరా?— గంగాదరం నారిగోన్ని చితక బాదకపోతే ఆయన గోరితోట మీద దాడిజేసే అవసరమే రాదు గందా. చనికమైన కోపంలో పెతీకారం చేసిండామె గాన ఆరి సామాన్లు మా కొంపల కెందుకు కొండబోతాము దొరా. మేమేమైనా దొంగలమై డకాయితీ జేత్తుండామా. కడుపు కోసం డకాయితీ జేసే వాళ్ళు గుట్టు మట్టుగా కుండా ఆమడ దూరంలో కొల్లగొడతారు గానీ వుండూళ్ళో జేసి దొరికి పోతారటయ్యా''—

అదే నిజమైన పక్షంలో నారిగాడు దెబ్బతింటూనే మీరే ముందుగా కేసు పెట్టుంటే సరిపొయ్యేది. ఆవేశాన్ని అణచుకొని ఆలోచనతో వ్యవహరించి వుంటే యిన్ని అనర్థాలకే ఆస్కార ముండేది గాదు.

"శోక మొచ్చినా కోప మొచ్చినా మడిసికి చెప్పిరావుగదయ్యా. ఎదట జరిగే యిసయం మీద ఆధారపడి మడిసి మనసు మారుతుంటది గదయ్యా. ద్రౌపది కోక లిప్పినపుడు బీముడంతటోడు కోపాన్నాపు కోలేక కేకలేసిండు. అంతెందుకూ అమాంతంగా నీసెత్తిన మొటిక్కాయ పడ్డాదనుకో ఎదుటోన్ని పట్టుక తంతావా లేక కేసెడ్దామని ఉపేచ్చిత్తావా. ఈ చెంపకుదగిలితే ఆ జెంప చూపటానికి మనమేం దేవతలము కాదు గదటయ్యా. ఒకేల మనం దేవతలుగా మారిపోతే అది గూడా ఎదుటోడికి అలుసే. ఇసయ సరిగ్నేనం లేనోళ్ళు కేసుల దాకా ఆలోచించరయ్యా. ఆయెట్టాలన్నా కాసింత యోచన బలముండాల.ఆపైన జేబునిండా దుడ్లుండాల. మాలటోళ్ళ బతుకులు మెరుగు పడాలంటే దెబ్బకు దెబ్బే మారగాంతర మనుకుంటా కానీ యాడుంటాదో ఎమో గానీ అప్పుడొస్తది మీ చెట్టం. మెలికలు దిప్పి మా పీకలు నులిమేస్తది. ఈ అన్నేయాలు ఆపుజెయ్యాలంటే మారగమే లేదు దొరా. ఇపుడిరపుడే నామనసు కోటి తడుతుండాది. దుడ్లు సంపాయించాల.

**ఆళ్ళతో** సమానంగావాల అపుడు — అప్పుడు''...

రత్తి దారా వాక్ప్రవాహాన్ని ఆలకిస్తూ అచేతనంగా నిల్చుండి పొయ్యాడు ప్రభంజన కుమార్. ఆయన మనస్సులో స్పందన ఆరంభమైంది. గుండె లోతుల్లో చైతన్య కవాటం తెరచుకున్నాది.

ఔను ఆమె మాటల్లో ఎంత నిజమున్నాది. ఆర్థిక సమానత్వం సిద్ధిస్తే తప్ప మనిషి నుంచి సాటి మనిషికి రక్షణ లేదు. ఈమె చెబుతున్నదంతా నిజమే అయినా ఈ దశలో వీళ్ళకి తనేం సహాయం చెయ్యలేడు. అక్షరాభ్యాసం చేసిన నాటి నుంచీ దాదాపు పదు నెనిమిది సంవత్సరాలు ఏకబిగిని చదువుకొని ఈ పోలీసు వుద్యోగం సంపాదించాడు. ఖాదీతో సాధించలేనిది కాకీతోసాధించ వచ్చునని ఆశించాడు. అధికారుల అదుపులో సంపన్నుల బాడీగార్డుగా వ్యవహరించటానికే సరిపోతున్నది. ఈ ఉద్యోగం ఆశయ సాధనకు గాదు. ఆహార సముపార్జనకు మాత్రమే ఆసరాగా మిగిలింది.

ఆయన మేధస్సులో ఆలోచనలు పరం పరలుగా ముందుకు సాగి పోతున్నాయి. సమకాలీన సమాజ స్వరూపం కండ్ల ముందు గిరున తిరుగు తున్నాది. ఎదుట నిల్చున్న నిందితులంతా దరిద్రానికి ప్రతీకలుగా మాత్రమే కన్పిస్తున్నారు. గతంలో తెలిసున్న పల్లె సీమలన్న స్మృతి పథంలో మెదలుతున్నాయి. వ్యవస్థ స్వభావం గ్రాహ్యమౌతు న్నది. సమతా నినాదాన్ని సవాలు చేస్తున్న సమస్యలన్ని నిలువెత్తు ప్రేతాల్లా సాక్షాత్కరించాయి.

కుడి చేత్తో రివాల్వర్ పిడిని బిగించి పట్టు కున్నాడు. ముఖం మీది స్వేద బిందువుల్ని బేరల్ తో తుడిచేశాడు. ఎడమ చేత్తో పిచ్చిగా జుత్తు పీక్కున్నాడు. అమాంతంగా అతని పెదాలు విచ్చు కున్నాయి. మగత నిదురలోని కలవరింతలా చిత్రంగా మాట్లాడేశాడు డి.యస్.పి ప్రభంజన కుమార్. ఆయన మనస్సులో మెదిలిన భావం అప్రయత్నంగా బహిర్గతమైంది.

''ఔను ఖాదర్ సాహెబ్ నువ్వెంత లోతైన మనిషివి. నిజంగా నీమాటల్లో నిగూఢ సత్యం దాగున్నాది. వ్యక్తి స్వార్థం నశించి ఆర్థిక సమానత్వం సిద్ధిస్తే తప్ప చట్టం సామాన్యులను ఆదుకోవటం అసాధ్యం. అడుగడుగునా అవినీతి చోటు చేసుకున్న ఈ వ్యవస్థ స్వరూప స్వభావాలు మారేదాకా బడుగు వర్గాలకి ఈ చట్టం రక్షణ కల్పించలేదు. అందుకే నిన్నే అడుగుతున్నాను. ఓ చట్టమా ఈ దశలో వీళ్ళకు నువ్వేం చెయ్యగలవు?!— నువ్వేం చెయ్యగలవు??!! — నువ్వేం చెయ్యగలవు???!!!'' *

